Follow: @ANNTELUGU

20-08-2026

ANN తెలుగు

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 226 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## సెక్షన్ 22ఏ ఏంటి? పొరపాటు ఎవరిది?

**హైదరాబాద్, మహా :** సెక్షన్ 22ఏ ఇపుడు తెలంగాణ ప్రజల గుండెల్లో రైళ్ళు పరుగెత్తిస్తోంది. హైడ్రాను మించిన భయాన్ని కలిగిస్తోంది. తెలంగాణ వ్యాప్తంగా, ముఖ్యంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్‌లో వేలాది మంది ప్రైవేట్ ఆస్తుల యజమానులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వారి ఇళ్లు, స్థలాలు, అపార్ట్‌మెంట్లు ఉన్నట్టుండి రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేరడంతో అమ్మకాలు, తనఖాలు, బదిలీలు నిలిచిపోయాయి. రెవెన్యూ రికార్డుల నవీకరణలో జరిగిన పరిపాలనా లోపాలే ఈ సంక్షోభానికి కారణమని తేలడంతో ప్రభుత్వం క్షమాపణలు చెప్పి, తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టింది. మరోవైపు, ఈ అంశంపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి.

**అసలేంటి సెక్షన్ 22ఏ? పొరపాటు ఎలా జరిగింది?**

రిజిస్ట్రేషన్ చట్టం, 1908లోని సెక్షన్ 22ఏ ప్రకారం ప్రభుత్వ భూములు, దేవాదాయ, వక్ఫ్ ఆస్తులు, అసైన్డ్ భూములు, భూదాన భూములు, కోర్టు వివాదాల్లో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్లను

మిగతా 3వ పేజీలో

టాప్ న్యూస్

## నాలుగు గంటల పాటు నిధి అగర్వాల్ విచారణ



- ఆన్ లైన్ బెట్టింగ్ పై ఈడీ షాక్
- ప్రమోషన్‌పై అధికారుల లోతైన ప్రశ్నలు

02

## వర్గపోరుతోనే జాతీయ కార్యవర్గంలో చోటు దక్కలేదు



- బీజేపీ రాష్ట్ర నేతలపై ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు
- ఇప్పటికైనా ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచన

02

## మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుకు ఊరట



- లైంగిక వేధింపుల కేసు కొట్టేసిన హైకోర్టు
- ఇరుపక్షాల వాదనలు విని కేసు కొట్టివేసిన హైకోర్టు

02




## ఏపీలో మునిసిపల్ ఎన్నికల నగారా

- గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం

**ఏపీ బ్యూరో, మహా :** ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి అవసరమైన అన్ని ముందస్తు చర్యలు, కార్యాచరణను వేగవంతం చేయాలని అధికార యంత్రాంగాన్ని ప్రభుత్వం ఆదేశించింది. ఇటీవల జరిగిన ఏపీ కేబినెట్ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్లను సైతం ఖరారు చేయడంతో ఎన్నికల ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. రాష్ట్రంలో ఇప్పటికే 87 మున్సిపాలిటీల్లో పాలక వర్గాల

మిగతా 2వ పేజీలో




# లోక్ సభ స్థానాలు 543 మించొద్దు

## డీలిమిటేషన్ వద్దు

- ఉన్న స్థానాల్లోనే మహిళలకు రిజర్వేషన్లు
- తక్షణమే మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలుచేయాలి
- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం డిమాండ్
- సోనియా, ఖర్గే, రాహుల్, ప్రియాంక, సీఎంలు రేవంత్, డీకే, వీడీసతీషన్, వీరభద్రసింగ్ హాజరు

02




## మంత్రి కొండాసురేఖకు షాక్

### షోకాజ్ నోటీసులు జారీ

- సుస్మితా పటేల్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్
- సీఎం రేవంత్‌రెడ్డిపై వ్యాఖ్యలతో పార్టీలో కలకలం
- పరకాల నుంచి పోటీ చేస్తానన్న సుస్మితా పటేల్

**హైదరాబాద్, మహా :** మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మితా పటేల్ చేసిన రాజకీయ వ్యాఖ్యలు సంచలనంగా మారగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఆమె చేసిన వ్యాఖ్యలపై పార్టీ హైకమాండ్ సీరియస్ అయింది. మంత్రి కొండా సురేఖకు దీనిపై షోకాజ్ నోటీసు జారీచేసి వివరణ కోరింది. వరంగల్ జిల్లా గీసుకొండలో బుధవారం మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుస్మితా పటేల్ వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి తాను పోటీ చేస్తానని ప్రకటించారు. కాంగ్రెస్ అధిష్ఠానం తనకు టికెట్ ఇవ్వకపోయినా స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానని స్పష్టం చేశారు. సుస్మిత వ్యాఖ్యలపై ఇప్పటికే పార్టీ క్రమశిక్షణ కమిటీ తీవ్రంగా స్పందించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా ఆమె వ్యాఖ్యలు ఉన్నాయని క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్టీ నిర్దేశించిన లక్ష్మణరేఖను ఎవరైనా అతిక్రమిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. వివరణకోరుతూ మంత్రికి క్రమశిక్షణకమిటీ షోకాజ్ నోటీస్ జారీచేసింది. కాగా మాజీమంత్రి చిన్నారెడ్డికి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఫిర్యాదుతో షోకాజ్ నోటీస్ జారీచేసింది.





## స్థానిక ఎన్నికలకు సిద్ధంకండి

### పార్టీ శ్రేణులకు వైఎస్ జగన్ పిలుపు

**తాడేపల్లి, మహా :** కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు ఐక్యంగా పని చేయాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నాయకులు, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులతో

మిగతా 2వ పేజీలో

## బాబు అనే పిలుపే..

- రూపారెడ్డి హత్యకేసు ఛేదించిన పోలీసులు
- టెన్త్ విద్యార్థులే హంతకులు.. వ్యసనాల బారినపడి

02



## మారుతున్న సవాళ్లు

- పోలీసు సిబ్బంది పునర్వ్యవస్థీకరణ
- డిజిపి సి. వి. ఆనంద్
- ట్రాఫిక్, రోడ్డు భద్రతకు అత్యధిక ప్రాధాన్యం
- గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఎస్ఐబీ నుంచి 513 మంది ఇతర విభాగాలకు బదిలీ
- డ్రగ్స్, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌పై ప్రత్యేక దృష్టి
- రెండు నెలల అటాచ్‌మెంట్ అనంతరం సిబ్బందికి కొత్త బాధ్యతలు

02



మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్‌కు షాక్

## ధాన్యం కుంభకోణం కేసు నమోదు

### రూ.40.96 కోట్ల ప్రభుత్వ ధాన్యం మాయమైనట్టు గుర్తింపు

**నిర్మల్, మహా :** ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖా నాయక్‌కు చెందిన ఏఆర్ఎస్ రైస్ మిల్లులో భారీగా ప్రభుత్వ ధాన్యం కొరత ఉన్నట్లు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో వెలుగులోకి వచ్చింది. ఖానాపూర్ మండలం సత్తనపల్లి గ్రామంలోని మిల్లులో 202223, 202324, 202425 రబీ సీజన్లకు సంబంధించిన ప్రభుత్వ ధాన్యంలో 9,639.962 మెట్రిక్ టన్నుల కొరత ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అధికారుల అంచనా ప్రకారం ఈ ధాన్యం విలువ సుమారు రూ.40.96 కోట్లు ఉంటుందని తెలిపారు. మిల్లులోని ధాన్యం నిల్వలు, రికార్డులను పరిశీలించిన అధికారులు.. ప్రభుత్వానికి అప్పగించాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్ ను లెక్కల్లో చూపకుండా

మిగతా 2వ పేజీలో

నాడెం చెరువు నాలాపై అక్రమ నిర్మాణాలను

## పరిశీలించిన ఇరిగేషన్ ఏఈఈ మౌనిక..!

- అక్రమ నిర్మాణాలపై చర్యలెప్పుడంటూ బాధితుల నిలదీత..!
- ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామంటూ స్పష్టీకరణ...!
- అక్రమ నిర్మాణాలను అడ్డుకోకపోతే నాలా ఒడ్డునే టెంట్ వేసి ధర్నాకు దిగుతాం .. వరద బాధితుల అల్టిమేటం...

**మహా, సిటీ బ్యూరో :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఘట్కేసర్ సర్కిల్, పోచారం డివిజన్ జోడిమెట్ల చౌరస్తా వద్ద గల నాడెం చెరువు నాలాపై కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నాలా ప్రవాహ మార్గాన్ని ఆక్రమిస్తూ చేపడుతున్న నిర్మాణాలపై స్థానిక వరద బాధితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) మౌనిక జోడిమెట్ల చౌరస్తా పరిసర ప్రాంతాలను సందర్శించి, నాడెం చెరువు ప్రధాన నాలాతో పాటు దానికి అనుసంధానంగా ఉన్న ఉప కాలువలు, అనుబంధ నీటి మార్గాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆక్రమణల

02

కాలనీలా ప్రతినిధులతో మాట్లాడుతున్న ఏ ఈ ఈ మౌనిక




మహా
తెలుగు దినపత్రిక
epaper.mahaadaily.com
19 Aug 2026 - Page 1
ఇరిగేషన్ అధికారులా మజాకా..!
జోడిమెట్లలో కనుమరుగైన నాడెం చెరువు నాలా...!
- యదేచ్ఛగా కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలు...!
- సూత్రపాత్రధారులు ఇరిగేషన్ అధికారులే..!
- నెలకో అధికారి బదిలీ.. దండిగా వసూళ్లు..!
- దమ్మీగా మారిన డీఈఈ అంజనేయులు, ఏఈఈ మౌనిక...!
- హెచ్ఎండీఏ జారీ చేసిన అనుమతులు రద్దు చేయాలి: వివిధ కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు...!
- నిర్మాణాలు ఆపకుంటే ఇరిగేషన్ కార్యాలయం ముందు ధర్నాకు దిగుతాం.. పోచారం మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి...!
- చస్తేగాని స్పందించరా.. వరద బాధితుల ఆక్రందన ...!

02

## సీఎం విజయ్ బాటలో కవిత

- విజయ్ వ్యక్తిగత జ్యోతిష్యుడు రాధన్ పండిట్ తో భేటీ

03



# నాడెం చెరువు నాలాపై అక్రమ నిర్మాణాలను పరిశీలించిన ఇరిగేషన్ ఏఈఈ మౌనిక..!


నాలాను పరిశీలిస్తున్న ఏ ఈ ఈ మౌనిక

( మొదటి పేజీ తరువాయి )

కారణంగా నీటి ప్రవాహానికి ఏర్పడుతున్న అడ్డంకులను ఆమె పరిశీలించి వివరాలు సేకరించారు.అధికారిణి పర్యటన విషయం తెలుసుకున్న హిమగిరి కాలనీ, డాక్టర్స్ కాలనీ, కాకతీయ కాలనీ, అన్నానగర్ కాలనీ, విజయసాయి కాలనీ, పోచారం కాలనీ, ఎమ్ఎల్ఆర్ కాలనీ, అరుంధతి కాలనీ, వెంకటేశ్వర కాలనీలకు చెందిన వరద బాధితులు, కాలనీ వాసులు అక్కడికి చేరుకుని తమ సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. నాలా ఆక్రమణల కారణంగా ప్రతి వర్షాకాలంలో తాము తీవ్ర ముంపు సమస్యలను ఎదుర్కొంటున్నామని, ఆస్తి నష్టంతో పాటు ప్రాణభయంతో జీవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.కళ్ల ముందే అక్రమ కట్టడాలు నిర్మితమవుతున్నా ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు ఎందుకు స్పందించడం లేదని, ఈ నిర్మాణాలపై చర్యలు ఎప్పుడు తీసుకుంటారంటూ బాధితులు ఇరిగేషన్ ఏఈఈ మౌనికను నిలదీశారు. దీనిపై స్పందించిన ఆమె, నాలా ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలకు సంబంధించిన పూర్తి వివరాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని బాధితులకు వివరించారు.అయితే అధికారుల సమాధానంపై వరద బాధితులు అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే అక్రమ నిర్మాణాలను నిలిపివేసి, నాలా ఆక్రమణలను తొలగించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నాడెం నాలా ఒడ్డునే టెంట్లు వేసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. "నాడెం చెరువు ప్రధాన నాలాతో పాటు అనుబంధ నాలాలు కూడా ఆక్రమణలకు గురవుతున్నాయనే ఆరోపణలు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. ప్రజలు పదేపదే ఫిర్యాదులు చేస్తున్నా, వరద బాధితులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం మారడం లేదు. ఇరిగేషన్ శాఖ ఏఈఈ మౌనిక క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించిన నేపథ్యంలో, ఆ పరిశీలన కేవలం నివేదికలకే పరిమితమవుతుందా..? లేక అక్రమ నిర్మాణాలపై నిజంగా చర్యలు తీసుకుంటారా..? అన్నది ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది" అని అన్నారు.వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన మరింత పెరుగుతోందని ఆయన తెలిపారు. "గతంలో వరదల కారణంగా హిమగిరి, డాక్టర్స్, కాకతీయ, విజయసాయి, అన్నపూర్ణ నగర్ తదితర కాలనీల ప్రజలు తీవ్ర నష్టాలను చవిచూశారు. ఇళ్లలోకి నీరు చేరి లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగింది. ఆ ఘటనల నుంచి ప్రజలు ఇంకా పూర్తిగా కోలుకోకముందే నాలాలపై నిర్మాణాలు కొనసాగడం అత్యంత ఆందోళనకర విషయం" అని పేర్కొన్నారు."ప్రజల ప్రాణాలు, ఆస్తులు ప్రమాదంలో పడుతున్నా సంబంధిత శాఖలు కాలయాపన చేస్తూ చేతులు దులుపుకోవడం సమంజసం కాదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా జోక్యం చేసుకుని నాడెం చెరువు నాలా అసలు హద్దులను గుర్తించాలి. నాలా ఆక్రమణలపై సమగ్ర సర్వే నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే అక్రమ నిర్మాణాలను తొలగించి సహజ నీటి ప్రవాహ మార్గాన్ని పునరుద్ధరించాలి" అని డిమాండ్ చేశారు."ఇప్పటికీ అధికారులు స్పందించకపోతే వరద బాధితులు, కాలనీవాసులు, ప్రజా సంఘాలతో కలిసి నాలా ఒడ్డునే టెంట్లు వేసి మహా ధర్నాకు దిగుతాం. అవసరమైతే ఈ పోరాటాన్ని ప్రజా ఉద్యమంగా మార్చి రాష్ట్ర స్థాయిలో తీసుకెళ్తాం.




**అధికారులు స్పందించకుంటే ప్రజా ఉద్యమం తప్పదు.. పోచారం మాజీ మున్సిపల్ చైర్మన్ యపల్లి కొండల్ రెడ్డి**



నాడెం చెరువు నాలా ఆక్రమణల వ్యవహారం ఇప్పుడు జోడిమెట్ల చౌరస్తా పరిసర ప్రాంతాల్లో తీవ్ర ఆందోళనకు దారితీస్తోందని పోచారం మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి పేర్కొన్నారు. వరుస ఫిర్యాదులు, పత్రికా కథనాలు, వరద బాధితుల వినతులు ఉన్నప్పటికీ నాలాపై కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను నిలువరించడంలో సంబంధిత శాఖలు విఫలమయ్యాయని ఆయన విమర్శించారు.




ప్రజల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. నాడెం చెరువు నాలాను కాపాడే వరకు మా పోరాటం కొనసాగుతుంది" అని బోయపల్లి కొండల్ రెడ్డి హెచ్చరించారు.

**వరద బాధితుల ఉసురు తగులుతుంది : ఎస్. శ్రీనివాస్ (డాక్టర్స్ కాలనీ ప్రతినిధి)**



నాడెం చెరువు నాలాపై కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలు భవిష్యత్తులో మరింత ప్రమాదకర పరిస్థితులకు దారితీసే అవకాశముందని డాక్టర్స్ కాలనీ ప్రతినిధి ఎస్. శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాది వరదల సమయంలో ప్రజలు ఎదుర్కొన్న కష్టాలను గుర్తు చేసుకుంటూ, అదే పరిస్థితి మళ్లీ పునరావృతం కాకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు."గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు మా కాలనీల్లోని అనేక ఇళ్లలోకి వరద నీరు చేరింది. ప్రజలు తమ గృహోపకరణాలు, వాహనాలు, విలువైన వస్తువులను కోల్పోయారు. కొందరు రోజుల తరబడి ఇళ్లను వదిలి బంధువుల వద్ద ఆశ్రయం పొందాల్సి వచ్చింది. ఆ నష్టం నుంచి ఇంకా పూర్తిగా కోలుకోకముందే, ఇప్పుడు నాలా ప్రవాహ మార్గాలను మరింత కుదిస్తూ భారీ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు."నాలా సహజ స్వరూపాన్ని ధ్వంసం చేస్తూ నిర్మాణాలు కొనసాగితే రానున్న వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారే ప్రమాదం ఉంది. ప్రజల ప్రాణాలు, ఆస్తులు ప్రమాదంలో పడకముందే అధికారులు అప్రమత్తం కావాలి. ఇది మా విజ్ఞప్తి మాత్రమే కాదు, చివరి హెచ్చరిక కూడా. వెంటనే క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను జేసీబీలతో తొలగించాలి. నాలా పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వకపోతే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది" అని స్పష్టం చేశారు.

**అధికారుల అండతోనే అక్రమ కట్టడాలు : ఈ. రవికుమార్ (డాక్టర్స్ కాలనీ అధ్యక్షుడు)**



నాడెం చెరువు నాలాపై భారీ బహుళ అంతస్తుల కమర్షియల్ నిర్మాణాలు కొనసాగుతున్నా సంబంధిత అధికారులు మౌనంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోందని డాక్టర్స్ కాలనీ అధ్యక్షుడు ఈ. రవికుమార్ విమర్శించారు. నాలా ప్రవాహ మార్గాలను ఆక్రమిస్తూ బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నప్పటికీ ఇరిగేషన్ శాఖ, మున్సిపల్ అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు."నాలా దిగువ ప్రాంతాల్లో ఉన్న డాక్టర్స్ కాలనీ, అన్నపూర్ణ నగర్, విజయసాయి కాలనీతో పాటు పలు కాలనీల ప్రజలు ప్రతి వర్షాకాలంలో ముంపు సమస్యను ఎదుర్కొంటున్నారు. ప్రజల ఇళ్లు నీట మునిగిపోతున్నా, లక్షల రూపాయల ఆస్తి నష్టం జరుగుతున్నా అధికార యంత్రాంగం స్పందించకపోవడం విచారకరం. క్షేత్రస్థాయిలో పరిశీలించి వెళ్లిపోవడం కాదు, వెంటనే నిర్మాణాలపై నిలుపుదల ఉత్తర్వులు జారీ చేసి పనులను ఆపించాలి. నాలా హద్దులను గుర్తించి ఆక్రమణలను తొలగించాలి" అని డిమాండ్ చేశారు."ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోకపోతే వరద బాధితులు, కాలనీవాసులందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతాం. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని" హెచ్చరించారు.




**అక్రమ నిర్మాణాలు ఆపకుంటే టెంట్ వేసి నిరవధిక ధర్నా చేస్తాం : అకిటి కృష్ణారెడ్డి (హిమగిరి కాలనీ అధ్యక్షుడు)**



జోడిమెట్ల చౌరస్తా వద్ద ఉన్న నాడెం చెరువు ప్రధాన నాలాతో పాటు దానికి అనుసంధానంగా ఉన్న ఉపనాలాలను సైతం కొందరు రియల్టర్లు, బిల్డర్లు ఇష్టారాజ్యంగా ఆక్రమించి ప్లాట్లు, వాణిజ్య నిర్మాణాలు చేపడుతున్నారని హిమగిరి కాలనీ అధ్యక్షుడు అకిటి కృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సహజ నీటి ప్రవాహ మార్గాలను పూర్తిగా ధ్వంసం చేస్తూ నాలాలపై కాంక్రీట్ కట్టడాలు నిర్మిస్తున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.
"గతంలో భారీ వర్షాలు కురిసినప్పుడు హిమగిరి కాలనీ, కాకతీయ కాలనీ, డాక్టర్స్ కాలనీ సహా పలు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగిపోయాయి. అయినప్పటికీ అధికారులు ఎలాంటి గుణపాఠం నేర్చుకోలేదు. ప్రస్తుతం పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. నాలాల వెడల్పు క్రమంగా తగ్గిపోవడంతో కొద్దిపాటి వర్షానికే కాలనీలు మోకాళ్లలోతు నీటిలో మునుగుతున్నాయి. ప్రజలు రాత్రంతా భయంతో గడపాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు."నాడెం చెరువు నాలాను, దానికి అనుసంధానంగా ఉన్న ప్రవాహ మార్గాలను వెంటనే సర్వే చేసి అసలు హద్దులను గుర్తించాలి. నాలా స్థలాలను ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలి. అధికారులు ఇప్పటికైనా స్పందించి నిర్మాణాలను నిలిపివేయకపోతే, హిమగిరి కాలనీతో పాటు పరిసర కాలనీల ప్రజలను సమీకరించి నాలా ఒడ్డునే టెంట్ వేసి నిరవధిక ధర్నాకు దిగుతాం. అక్రమ నిర్మాణాలను పూర్తిగా తొలగించి నాలా పునరుద్ధరణ చేపట్టే వరకు మా పోరాటం ఆగదు" అని హెచ్చరించారు.



## నాలుగుగంటల పాటు నిధి అగర్వాల్ విచారణ

**ఆన్ లైన్ బెట్టింగ్‌పై ఈడీ షాక్**

**హైదరాబాద్, మహా :** ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల ప్రమోషన్ కేసులో టాలీవుడ్ కథానాయిక నిధి అగర్వాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ షాక్ ఇచ్చింది. ఈ వ్యవహారానికి సంబంధించి అధికారుల ఎదుట హాజరైన ఆమెను ఈడీ బృందం సుమారు నాలుగు గంటల పాటు ప్రశ్నించింది. ప్రధానంగా 'జీత్ విన్' లాంటి గేమింగ్ యాప్‌ల ప్రచారంలో ఆమె భాగస్వామ్యంపై అధికారులు లోతుగా దర్యాప్తు చేశారు. ఈ ఒప్పందాలకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లను పరిశీలించిన అధికారులు... ప్రమోషన్స్ కోసం ఆమె అందుకున్న భారీ పారితోషికం వివరాలు, ఆ నగదు హవాలా మార్గంలో వచ్చిందా లేక బ్యాంకింగ్ లావాదేవీల ద్వారా చెల్లించారా అనే అంశాలపై సుదీర్ఘంగా ప్రశ్నించినట్టు సమాచారం. దేశంలో వేల కోట్ల రూపాయల మనీ లాండరింగ్‌కు పాల్పడుతూ, అక్రమంగా విదేశాలకు నిధులు తరలిస్తున్న బెట్టింగ్ నెట్‌వర్క్‌లపై ఈడీ ఉక్కుపాదం మోపుతోంది. ఇందులో భాగంగానే ఈ యాప్‌లకు ప్రచారకర్తలుగా వ్యవహరించిన సినీ సెలబ్రిటీలు, సోషల్ మీడియా స్టార్లపై ప్రత్యేక దృష్టి పెట్టి వరుసగా నోటీసులు ఇస్తూ విచారిస్తోంది. విచారణ పూర్తయిన తర్వాత ఈడీ ఆఫీస్ నుంచి బయటకు వచ్చిన నిధి అగర్వాల్‌ను మీడియా ప్రతినిధులు చుట్టుముట్టినప్పటికీ, ఆమె ఏ ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా మౌనంగా తన కారులో వెళ్లిపోయారు.

## మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుకు ఊరట

- **లైంగిక వేధింపుల కేసు కొట్టేసిన హైకోర్టు**
- **ఇరుపక్షాల వాదనలు విని కేసు కొట్టివేసిన హైకోర్టు**

**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై నమోదైన లైంగిక వేధింపుల కేసును న్యాయస్థానం కొట్టివేసింది. పెళ్లి పేరుతో ఓ యువతిని లైంగికంగా వేధించారని ఆరోపిస్తూ హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కాంతారావుపై కేసు నమోదైంది. తన ప్రైవేట్ ఫొటోలతో కాంతారావు బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని , రియల్ ఎస్టేట్ వ్యవహారం పేరుతో తన వద్ద నుంచి రూ.4 లక్షలు తీసుకుని మోసం చేశారని కూడా ఆమె ఆరోపించినట్లు పోలీసులు తెలిపారు. తనపై నమోదైన కేసును సవాల్ చేస్తూ రేగా కాంతారావు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం ఆయనపై నమోదైన కేసును కొట్టివేసింది.



# లోక్ సభ స్థానాలు 543 మించొద్దు

**ఢిల్లీ, మహా :** కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న నియోజకవర్గాల పునర్విభజన డీలిమిటేషన్ ప్రక్రియను సీడబ్ల్యూసీ తీవ్రంగా వ్యతిరేకించింది. లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచకుండా, ప్రస్తుతం ఉన్న 543 స్థానాల పరిమితిని అలాగే కొనసాగించాలని పార్టీ డిమాండ్ చేసింది. ఢిల్లీలోని ఇందిరా భవన్ వేదికగా బుధవారం జరిగిన సమావేశంలో పలు కీలక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. జనాభా ప్రాతిపదికన చేపట్టే డీలిమిటేషన్ వల్ల జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేసింది. మహిళా రిజర్వేషన్ల అమలును డీలిమిటేషన్ ప్రక్రియతో ముడిపెట్టడం సరికాదని, ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాల్లోనే తక్షణమే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ నాయకత్వం స్పష్టం చేసింది.

**వందేమాతరం రెండు చరణాలే**

'వందేమాతరం' జాతీయ గీతాలాపనపై కొనసాగుతున్న వివాదంపై చర్చిస్తూ, 1937 నాటి సీడబ్ల్యూసీ తీర్మానానికి అనుగుణంగా మొదటి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలనే విధానానికి కట్టుబడి ఉంటామని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ పునరుద్ఘాటించింది.



మరోవైపు సరిహద్దుల్లో చైనా దురాక్రమణలు, చొరబాట్ల వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని సీడబ్ల్యూసీ తీవ్రంగా తప్పుబట్టింది. సరిహద్దుల్లోని వాస్తవ పరిస్థితులను దేశ ప్రజలకు వెల్లడించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తింది. భారత భూభాగాన్ని ఆక్రమించేందుకు చైనా చేస్తున్న కుట్రలపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వీడి దేశానికి స్పష్టమైన సమాధానం చెప్పాలని నాయకులు డిమాండ్ చేశారు. జాతీయ భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని, ఈ అంశంపై పార్లమెంట్‌లో లోతైన చర్చ జరగాలని తీర్మానించారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని, పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లి కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సీడబ్ల్యూసీ పిలుపునిచ్చింది.



## వర్గపోరుతోనే జాతీయ కార్యవర్గంలో చోటు దక్కలేదు

- **బీజేపీ రాష్ట్ర నేతలపై ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు**
- **ఇప్పటికైనా ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచన**

**హైదరాబాద్, మహా :** బీజేపీ జాతీయ కార్యవర్గంలో తెలంగాణ నాయకులకు ప్రాతినిధ్యం దక్కకపోవడంపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పార్టీలో కొనసాగుతున్న వర్గ రాజకీయాలే దీనికి ప్రధాన కారణమని ఆరోపిస్తూ, రాష్ట్ర నేతలంతా తమ వైఖరిపై ఆత్మపరిశీలన చేసుకోవాలని అన్నారు. గతంలో రాష్ట్రానికి చెందిన సీనియర్ నేతలకు జాతీయ స్థాయిలో కీలక పదవులు దక్కేవని, కానీ ఈసారి ఒక్కరికి కూడా జాతీయ కార్యవర్గంలో చోటు కల్పించలేదని రాజా సింగ్ అన్నారు. తెలంగాణ బీజేపీలో నిరంతరం గ్రూప్ రాజకీయాలు నడుస్తున్నాయని, ప్రతి చిన్న విషయానికీ ఢిల్లీకి వెళ్లి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకునే సంస్కృతి పెరిగిపోయిందని విమర్శించారు. నాయకుల మధ్య ఉన్న ఈ తీవ్ర విభేదాల వల్లే 'తెలంగాణ నేతలు మారరు' అనే ముగింపునకు అధిష్ఠానం వచ్చి ఉంటుందని, అందుకే ఈ నిర్ణయం తీసుకుందని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేసేందుకు జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ నాయకత్వంలో ప్రత్యేక ప్రణాళికలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర నేతలంతా పాత విభేదాలను, స్వయం ప్రయోజనాలను పక్కనబెట్టి, పశ్చిమ బెంగాల్ తరహాలో ఐక్యంగా పోరాడి తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఐకమత్యంతో పోరాడితేనే భవిష్యత్తులో పార్టీ

## ఏపీలో మునిసిపల్ ఎన్నికల నగారా

( మొదటి పేజీ తరువాయి )

గడువు ముగియగా, నవంబర్ నాటికి మరో 13 పాలకవర్గాల పదవీకాలం పూర్తి కానుంది. దీంతో మొత్తం 100 పురపాలికలకు త్వరలోనే ఎన్నికల నగారా మోగనుంది. ప్రభుత్వం నుంచి అధికారిక అనుమతి లభించడంతో తదుపరి ఎన్నికల షెడ్యూల్, ఏర్పాట్ల ప్రక్రియ అంతా రాష్ట్ర ఎన్నికల సంఘం పరిధిలోకి వెళ్లనుంది. మరోవైపు మున్సిపల్ ఎన్నికల నిర్వహణ సంకేతాలతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఎన్నికల్లో సత్తా చాటేందుకు అధికార కూటమి పక్షాలు ఇప్పటికే పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతుండగా, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సైతం పార్టీ శ్రేణులు స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్ల ప్రకటన, ఓటర్ల జాబితాల సవరణ వంటి కసరత్తులు వేగవంతం అవుతుండటంతో క్షేత్రస్థాయిలో పార్టీలన్నీ వ్యూహ ప్రతివ్యూహాలకు పదును పెడుతున్నాయి.

## స్థానిక ఎన్నికలకు సిద్ధంకండి

( మొదటి పేజీ తరువాయి )

ఆయన కీలక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకు, దృష్టి మళ్లించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికలలో ప్రజల ఆమోదాన్ని అడ్డుకోవడానికి అధికార యంత్రాంగాన్ని, పోలీసులను ప్రయోగించే అవకాశం ఉందని, అన్నింటినీ ఎదుర్కొని పోరాటానికి సిద్ధం కావాలని నాయకులకు సూచించారు. వైసీపీకి ఉన్న ప్రజాదరణతో రాబోయే ఎన్నికల్లో విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. మరో ఏడాదిలో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు.

# సెక్షన్ 22ఏ ఏంటి? పొరపాటు ఎవరిది?

(మొదటి పేజీ తరువాయి )

నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. ప్రభుత్వ ఆస్తులను అక్రమ బదిలీల నుంచి కాపాడటమే దీని ముఖ్య ఉద్దేశం. అయితే, ధరణి పోర్టల్ స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 'భూ భారతి' విధానంలోకి మారే క్రమంలో, 2026 ఏప్రిల్‌లో రెవెన్యూ శాఖ నిషేధిత ఆస్తుల జాబితాను నవీకరించింది. ఈ ప్రక్రియలో అధికారులు సరైన పరిశీలన లేకుండానే జాబితాలను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపారు. ఒకే సర్వే నంబర్‌లో కొంత భాగం ప్రభుత్వ భూమి ఉంటే, ఆ సర్వే నంబర్‌లోని మొత్తం ప్రైవేట్ పట్టా భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చడంతో ఈ గందరగోళం తలెత్తింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. జూబ్లీ హిల్స్, బంజారాహిల్స్ వంటి ఖరీదైన ప్రాంతాలతో పాటు, దశాబ్దాల క్రితం హుడా, హెచ్‌ఎండీఏ అనుమతులతో ఏర్పడిన కాలనీలు, అపార్ట్‌మెంట్లు కూడా ఈ జాబితాలో చేరాయి. రిజిస్ట్రేషన్ కోసం వెళ్లినప్పుడే తమ ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నాయని యజమానులకు తెలియడంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ సమస్యపై ఇప్పటికే సుమారు 6,000 కేసులు హైకోర్టులో నడుస్తున్నాయి.

**ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు**

ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ, అధికారుల నిర్లక్ష్యం, పొరపాట్ల వల్లే ఇది జరిగిందని అంగీకరించారు. నిజమైన యజమానులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు తెలిపారు. సమస్య పరిష్కారానికి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ (18005994788) కూడా ప్రారంభించామని ప్రకటించారు. ఫిర్యాదు అందిన మూడు రోజుల్లో స్పందిస్తామని హామీ ఇచ్చారు. మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంపై మంత్రులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న ఆస్తుల వివరాలను రెండు రోజుల్లో ధృవీకరించి, అవి ప్రైవేట్ ఆస్తులని తేలితే వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశించారు. "ఒక్క అంగుళం ప్రైవేట్ భూమికి కూడా నష్టం జరగనివ్వం" అని స్పష్టం చేస్తూ, దళారులను ఆశ్రయించవద్దని ప్రజలకు సూచించారు. ప్రభుత్వ ఆదేశాలతో ఇప్పటికే మేడ్చల్‌మల్కాజ్‌గిరిలో 30, రంగారెడ్డిలో 4 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి.

**ప్రతిపక్షాల ఫైర్.. డిఫెన్స్ లో సర్కార్**

ఈ పరిణామంపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో ఫైర్ అవుతున్నాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని, డిసెంబర్ 2023 నుంచి జాబితాలో చేర్చిన ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలని బీఆర్ఎస్ నేత హరీశ్ రావు డిమాండ్ చేశారు. జాబితా నుంచి పేర్లు తొలగించడానికి కొందరు అధికారులు కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బాధితులకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు తెలంగాణ భవన్‌లో లీగల్ ఎయిడ్ సెల్‌ను ప్రారంభించారు. బీజేపీ నేతలు కూడా ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్దేశపూర్వకంగా ఏ ఒక్క ప్రైవేట్ ఆస్తిని జాబితాలో చేర్చలేదని, కేవలం పొరపాట్లను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. బాధిత యజమానులు తమ ఆస్తుల వివరాలను అధికారిక వెబ్‌సైట్లలో చూసుకోవాలని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన మార్గాలను వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.




# సైబర్ నేరాల పై విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలి

- **సైబర్ క్రైమ్ పోలీస్ ఇన్స్పెక్టర్ ఎం వెంకట రమణ**

**వరంగల్, క్రైమ్ మహా ;** సైబర్ నేరాల పై ప్రజలు, విద్యార్థులు, యువతలో అవగాహన కల్పించే లక్ష్యంతో "సురక్షా కా తిరంగా" కార్యక్రమంలో భాగంగా కాకతీయ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ క్రైమ్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులు, వర్కింగ్ ప్రొఫెషనల్స్ మరియు ఇతరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సైబర్ నేరగాళ్లు ప్రస్తుతం అనుసరిస్తున్న నూతన మోసపూరిత విధానాలపై పోలీసు అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించారు. ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్ మోసం, ఇన్వెస్ట్‌మెంట్ మోసం, రిమోట్ యాక్సెస్ యాప్ మోసం, బ్యాంక్/కేవైసీ అప్‌డేట్ మోసం వంటి సైబర్ నేరాల తీరును వివరించారు.డిజిటల్ అరెస్ట్ మోసంలో పోలీసు లేదా ప్రభుత్వ అధికారులుగా నటిస్తూ, బాధితులను ఏదో కేసులో ఇరుక్కున్నారని భయపెట్టి డబ్బులు వసూలు చేసే విధానాన్ని వివరించారు. అలాగే ఇన్వెస్ట్‌మెంట్ మోసాల్లో తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని నమ్మించి నకిలీ పెట్టుబడి పథకాల పేరుతో డబ్బులు దోచుకునే విధానం గురించి అవగాహన కల్పించారు.రిమోట్ యాక్సెస్ యాప్ మోసాల్లో అనుమానాస్పద యాప్‌లను ఇన్‌స్టాల్ చేయించి మొబైల్ ఫోన్, బ్యాంకు ఖాతాలపై నియంత్రణ సాధించే విధానాన్ని, బ్యాంక్/ కేవైసి అప్‌డేట్ మోసాల్లో కేవైసి నవీకరణ పేరుతో వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు, ఓటీపిలను సేకరించి మోసాలకు పాల్పడే విధానాలను వివరించారు.ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు పలు ముఖ్య సూచనలు చేశారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత లేదా బ్యాంకింగ్ వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించరాదని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించే ముందు వాటి నిజానిజాలను తప్పనిసరిగా ధృవీకరించాలని సూచించారు. తెలియని లేదా అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయకూడదని హెచ్చరించారు.అదేవిధంగా ఓటీపి, పిన్, సీవివి, పాస్‌వర్డ్ లతో పాటు ఇతర రహస్య బ్యాంకింగ్ వివరాలను ఎవరికీ తెలియ జేయరాదని స్పష్టం చేశారు. పోలీసులు, బ్యాంకు అధికారులు లేదా ప్రభుత్వ అధికారులు ఎవరైనా ఫోన్ ద్వారా రహస్య బ్యాంకింగ్ వివరాలు, ఓటిపి లు అడగరని తెలిపారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైనట్లయితే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాల విషయంలో బాధితులు ఎంత త్వరగా ఫిర్యాదు చేస్తే అంత త్వరగా లావాదేవీలను నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు.అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారికి సైబర్ భద్రత పై మరింత అవగాహన కల్పించే ఉద్దేశంతో సైబర్ అవేర్‌నెస్ క్విజ్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఎం. వెంకటరమణ, కేయూ సీఐ రవికుమార్, ఎస్ ఐ లు శ్రావణి, చరణ్, హెడ్ కానిస్టేబుల్ పి. శ్రీనివాస్, కానిస్టేబుల్ జాహురుద్దీన్తో పాటు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# అమిత్ షాకు ఘన స్వాగతం

**దక్షిణాది రాష్ట్రాల సమన్వయానికి జోనల్ కౌన్సిల్ కీలకం.**

**చెన్నై, మహా :** కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెన్నై చేరుకున్న సందర్భంగా భాజపా జాతీయ సహ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల భాజపా నేతలు, కార్యకర్తలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆయన కేంద్ర హోంమంత్రికి స్వాగతం తెలిపారు.ఈ నెల 20న చెంగల్పట్టు జిల్లా కోవళంలోని తాజ్ ఫిషర్‌మ్యాన్స్ కోవ్‌లో జరగనున్న దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ 31వ సమావేశంలో పాల్గొనేందుకు అమిత్ షా తమిళనాడుకు వచ్చారు. కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించేందుకు దక్షిణాది జోనల్ కౌన్సిల్ సమావేశం ముఖ్యమైన వేదికగా నిలుస్తుందని సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు.అమిత్ షాకు స్వాగతం పలికిన వారిలో తమిళనాడు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్, రాష్ట్ర ఇన్‌చార్జి అరవింద్ మీనన్, భాజపా మత్స్యకార ప్రతినిధుల బృందం, న్యూ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ ఏ.సి. షణ్ముగం, ఎమ్మెల్యే భోజరాజన్, అన్నాడీఎంకే ప్రతినిధుల బృందం, ఇతర నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.ఇదే సందర్భంగా ఐఎస్ఐ మద్దతుతో పనిచేస్తున్న షహజాద్ భట్టి ఉగ్రవాద నెట్‌వర్క్‌పై భద్రతా, నిఘా సంస్థలు ఇటీవల చేపట్టిన సమన్వయ చర్యలను సుధాకర్‌రెడ్డి అభినందించారు. 14 రాష్ట్రాల్లో 200 మందికి పైగా ఆపరేటివ్‌లను అరెస్టు చేసిన ఈ చర్య ఉగ్రవాదంపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న జీరో టాలరెన్స్ విధానానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నాయకత్వంలో దేశ భద్రత విషయంలో ఎలాంటి కుట్రలనైనా కఠినంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. భద్రత, నిఘా సంస్థల అప్రమత్తతను అభినందిస్తూ వారికి సుధాకర్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

# మారుతున్న సవాళ్లు



**హైదరాబాద్, మహా :** మారుతున్న నేర స్వభావం, ప్రజా భద్రతకు ఎదురవుతున్న కొత్త సవాళ్లకు అనుగుణంగా పోలీసు శాఖలో మానవ వనరులను పునర్వ్యవస్థీకరిస్తున్నట్లు పోలీస్ అకాడమీలో బుధవారం జరిగిన సమావేశంలో డిజిపి సి. వి. ఆనంద్ తెలిపారు. ఒకప్పుడు వామపక్ష తీవ్రవాదం, ఉగ్రవాదం ప్రధాన సవాళ్లుగా ఉండగా.. ప్రస్తుతం డ్రగ్స్, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, పెట్టుబడి మోసాలు, ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత, ఆహార కల్తీ వంటి అంశాలు పోలీసులకు కొత్త సవాళ్లుగా మారాయని చెప్పారు.

**513 మందికి కొత్త బాధ్యతలు**

గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఎస్ఐబీ తదితర ప్రత్యేక విభాగాల నుంచి 513 మంది సిబ్బందిని ఎనిమిది విభాగాలకు అవసరాలకు అనుగుణంగా కేటాయించారు. వీరిలో ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు, 22 మంది ఎస్ఐలు, 14 మంది ఏఎస్ఐలు, 84 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 388 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. అత్యధికంగా 224 మందిని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్డు భద్రత విభాగానికి కేటాయించారు. ఆహార కల్తీ, డ్రగ్ కంట్రోల్‌కు 80 మంది, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు 79 మంది, సివిల్ సప్లయిస్‌కు 28 మంది, డిజిపి కార్యాలయం-టిస్ప్రార్క్‌కు 27 మంది, ఏసీబీ, సీఐడీ, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలకు 25 మంది చొప్పున కేటాయించారు. కొత్త బాధ్యతలు అప్పగించే ముందు సిబ్బందిని వివిధ విభాగాల్లో రెండు నెలల పాటు అటాచ్‌మెంట్‌పై పనిచేయించామని డిజిపి తెలిపారు. ప్రభుత్వ అనుమతితో ఆయా విభాగాల్లో పోస్టుల ఏర్పాటు ఆధారంగా తుది కేటాయింపులు చేశామన్నారు. సిబ్బంది విద్యార్హతలు, అనుభవం, నేపథ్యాన్ని పరిశీలించడంతో పాటు వ్యక్తిగతంగా ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు చెప్పారు. కొత్త విభాగాల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ పోలీస్ అకాడమీలో 11 రోజుల ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు.

**తీవ్రవాదం నుంచి సైబర్ నేరాల వరకు**

తెలంగాణలో 1980, 1990 దశకాల్లో వామపక్ష తీవ్రవాదం తీవ్రంగా ఉండేదని డీజీపీ గుర్తుచేశారు. అప్పటి పరిస్థితుల్లో ప్రత్యేక పోలీసు బలగం అవసరమై 1987లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు హయాంలో కేఎస్ వ్యాస్ నేతృత్వంలో ప్రత్యేక విభాగం ఏర్పడిందని తెలిపారు. అదే క్రమంలో గ్రేహౌండ్స్ రూపుదిద్దుకుందని చెప్పారు. గ్రేహౌండ్స్, ఎస్ఐబీ తదితర విభాగాలు మావోయిస్టు కార్యకలాపాల నియంత్రణలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. 2017 తర్వాత తెలంగాణలో మావోయిస్టు కార్యకలాపాలు గణనీయంగా తగ్గాయని, అయితే ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇటీవల కర్రెగుట్టల ప్రాంతాన్ని సందర్శించిన సందర్భంగా అక్కడ మౌలిక వసతుల కొరత స్పష్టంగా కనిపించిందని, కొన్ని ప్రాంతాల్లో రహదారులు, పాఠశాలలు, వైద్య సదుపాయాలు ఇంకా మెరుగుపడాల్సి ఉందన్నారు. 2007లో హైదరాబాద్‌లో లుంబినీ పార్క్, చార్మినార్ ప్రాంతాల్లో జరిగిన ఉగ్రదాడుల నేపథ్యంలో ప్రత్యేక కౌంటర్ టెర్రిజం సామర్థ్యాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఏర్పడిందని, దాని ఫలితంగా ఆక్టోపస్ వంటి ప్రత్యేక విభాగాలు అభివృద్ధి చెందాయని డిజిపి వివరించారు.

**విద్యార్థులపై డ్రగ్స్ పంజా**

యువతలో డ్రగ్స్ వినియోగం పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశమని డిజిపి అన్నారు. గతేడాది 835 మంది విద్యార్థుల్లో డ్రగ్స్ ఆనవాళ్లు గుర్తించినట్లు తెలిపారు. మరో విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అధ్యయనంలో సుమారు 70 శాతం మంది విద్యార్థులు డ్రగ్స్‌కు గురైనట్లు తేలిందని చెప్పారు. డ్రగ్స్ సరఫరా గొలుసును పూర్తిగా అడ్డుకోవడంతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యా సంస్థల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలను ఇప్పుడే కాపాడుకోకపోతే భవిష్యత్తులో పరిస్థితి మరింత తీవ్రంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**సైబర్ నేరాల్లో రూ.1,750 కోట్ల నష్టం**

సైబర్ నేరాలు మరో ప్రధాన సవాలుగా మారాయని డిజిపి తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్, పెట్టుబడి మోసాలు, నకిలీ యాప్‌ల ద్వారా మోసాలు పెరుగుతున్నాయని చెప్పారు. గత ఏడాది తెలంగాణలో సైబర్ నేరాల కారణంగా సుమారు రూ.1,750 కోట్ల ఆర్థిక నష్టం జరిగినట్లు తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక విభాగాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**రోడ్డు భద్రతకు పెద్దపీట**

తాజా పునర్వ్యవస్థీకరణలో రోడ్డు భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు డీజీపీ తెలిపారు. గత ఏడాది తెలంగాణలో రోడ్డు ప్రమాదాల్లో సుమారు 8 వేల మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ, అమలును మరింత బలోపేతం చేసేందుకు 224 మంది సిబ్బందిని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్డు సేఫ్టీ విభాగానికి కేటాయించినట్లు తెలిపారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి వాటికి సంబంధించిన ఇంజినీరింగ్ లోపాలను సరిదిద్దేందుకు సంబంధిత ప్రభుత్వ శాఖలతో కలిసి పనిచేస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక రోడ్డు భద్రత కార్యక్రమాన్ని చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

**క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి**

కొత్త బాధ్యతలు స్వీకరిస్తున్న సిబ్బంది నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని డీజీపీ సూచించారు. శారీరక దారుఢ్యాన్ని కాపాడుకోవడంతో పాటు విధుల్లో నిర్లక్ష్యానికి తావివ్వకూడదన్నారు. కొత్త బాధ్యతలకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకుని క్రమశిక్షణతో, వృత్తి నైపుణ్యంతో పనిచేయాలని సూచించారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల్లో ఫీల్డ్ ఆపరేషన్లు, నిర్వహణ, శిక్షణ తదితర అవసరాలకు సరిపడా సిబ్బందిని కొనసాగించినట్లు డిజిపి తెలిపారు. మూడు నెలల అనంతరం సిబ్బంది అవసరాలు, పనితీరును మరోసారి సమీక్షిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆక్టోపస్, సీఐడీ, ఎస్ఐబీ, ఇంటెలిజెన్స్ తదితర ప్రత్యేక విభాగాలకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# సీఎం విజయ్ బాటలో కవిత

**విజయ్ వ్యక్తిగత జ్యోతిష్యుడు రాధన్ పండిట్ తో భేటీ**

హైదరాబాద్, మహా : టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత తమిళనాడుకు చెందిన ప్రముఖ జ్యోతిష్యుడు రికీ రాధన్ పండిట్ వెట్రివేల్ తో భేటీ కావడం హాట్ టాపిక్‌గా మారింది. వెట్రివేల్ తమిళనాడు సీఎం విజయ్‌కి అత్యంత సన్నిహితుడు. ఆయన ఇటీవల తమిళనాడు ఎన్నికల్లో విజయ్ గెలుపులో కీలక పాత్ర పోషించారని అక్కడి రాజకీయ వర్గాల్లో భావిస్తుంటారు. బుధవారం ఉదయం ఆయన హైదరాబాద్‌లో కవిత నివాసంలో ఆమెతో పాటు కుటుంబసభ్యుల్ని కలిశారు. ప్రస్తుతం రాజకీయంగా రాష్ట్రంలో అనేక పరిణామాలు చోటుచేసుకుంటున్న తరుణంలో వెట్రివేల్‌తో కవిత భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. జ్యోతిష్యులతో భేటీ వెనుక కారణం ఏమై ఉంటుందని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. భవిష్యత్తులో ఆమె రాజకీయ ప్రయాణం ఎలా ఉండబోతుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇటీవల తమిళనాడులో సీఎం విజయ్ పథకాలపై కవిత ప్రశంసలు కురిపించారు. తెలంగాణలో అమ్మ పాలన అందిస్తానని కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం విజయ్ వ్యక్తిగత జ్యోతిష్కుడిని కలిసి కవిత ఏం చర్చించారు, ఆయన కవితకు రాజకీయ భవిష్యత్తు గురించి ఏవైనా సలహాలు, సూచనలు అందించారా? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.





# నిబంధనలు పాటిస్తేనే అనుమతులు

**నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు**
**బల్దియా కమిషనర్ టి. వెంకన్న**

వరంగల్, కార్పొరేషన్ మహా ;భవన నిర్మాణ నిబంధనలను ఖచ్చితంగా పాటించినప్పుడే అనుమతులు మంజూరు చేస్తామని, అనుమతించిన నిర్మాణ ప్రణాళిక (శాంక్షన్డ్ ప్లాన్) ప్రకారమే భవనాలు నిర్మించిన వారికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు (ఓసీ) జారీ చేస్తామని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న స్పష్టం చేశారు.బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను కమిషనర్ క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. హంటర్ రోడ్, ప్రకాశ్‌రెడ్డి పేట, నక్కలగుట్ట, జూలైవాడ, ఎక్సైజ్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించిన ఆయన, నిర్మాణాలను పరిశీలించి, భవనాల కొలతలను వేయించారు. అనుమతించిన నిర్మాణ ప్రణాళికకు అనుగుణంగానే భవనాలు నిర్మించారా లేదా అనే అంశాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో కొత్తగా భవన నిర్మాణాలు చేపట్టే యజమానులు తప్పనిసరిగా మున్సిపల్ శాఖ నుంచి ముందస్తు అనుమతులు పొందాలని సూచించారు. అనుమతించిన ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. భవన యజమానులు మంజూరైన ప్లాన్ ప్రకారమే నిర్మాణాలను పూర్తి చేసి, అనంతరం ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.నిర్మాణ అనుమతులు, భవన నిర్మాణ నిబంధనలు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల విషయంలో ఎలాంటి ఉల్లంఘనలకు తావు లేకుండా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు.ఈ తనిఖీల్లో సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ప్రశాంత్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అవినాష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.




# నీట్ పీజీ 2026 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, మహా ;** నీట్ పీజీ 2026 పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టి, పరీక్షను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టరేట్ లో బుధవారం నీట్ పరీక్ష ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.వరంగల్‌లోని బాలాజీ ఇన్స్టిట్యూట్ , లక్నేపల్లి , నర్సంపేట లో నీట్ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం నుండి ఆదేశాలు వచ్చినందున, ఆ ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం తదితర ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.పరీక్షా కేంద్రంలో అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని, పరీక్ష నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.అభ్యర్థులు నిర్ణీత సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకునేలా అవసరమైన సమాచారాన్ని అందించాలని, పరీక్ష సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకో కుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరీక్ష నిర్వహణలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.పరీక్షా కేంద్రం పరిసరాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు చేపట్టడంతో పాటు, అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశం లో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, డిఆర్వో విజయ లక్ష్మి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఘన వ్యర్థాల నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించాలి

- **నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా మార్చడానికి సరైన ప్రణాళికలను రూపొందించాలి**
- **జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయి**



**హనుమకొండ, మహా ;** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఘన వ్యర్థాల నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయం ఛాంబర్ నుండి...గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఘన వ్యర్థాల నిర్వహణ( సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ )పై మున్సిపల్ అధికారులు, ఎమ్మెస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ , ఐ ఐ టీ చెన్నై, శ్రీచర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ చెన్నై సంస్థల ప్రతినిధులతో సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు.కార్పొరేషన్ పరిధిలో ఘన వ్యర్థాల (తడి, పొడి చెత్త వ్యర్థాల)నిర్వహణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులు, సంస్థల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ తడి, పొడి చెత్త వ్యర్థాల నిర్వహణలో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మెరుగైన నిర్వహణ కోసం తగిన ప్రణాళికలను రూపొందించాలన్నారు. పెరుగుతున్న ఘన వ్యర్థాల సమస్యకు సమర్థవంతమైన పరిష్కారం చూపేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇళ్ల నుండి వచ్చే చెత్తను తడి, పొడి వ్యర్థాలుగా వేరు చేసి సేకరించడం ద్వారా వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టవచ్చన్నారు . ప్రజలకు ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించాలని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రజల సహకారం,మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు సమన్వయంతో పనిచేస్తే నగరం క్లీన్, గ్రీన్ సిటీగా మారుతుందన్నారు. ఘనవిర్థాల నిర్వహణపై సరైన ప్రణాళిక పరిశోధనతో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ను రాబోయే ఐదు సంవత్సరాలలో స్వచ్ఛత నగరంగా మార్చేందుకు కృషి చేయాలన్నారు. గ్రేటర్ వరంగల్ నగరంలో నిర్వహణ పై పరిష్కార చర్యలకు పరిశోధన, నిర్వహణ సహాయ సహకారాలు అందిస్తూ జి డబ్ల్యూ ఎం సి స్వచ్ఛ సిటీ గా మార్చుటకు రాబోయే 5 సంవత్సరాలలో చేయూత అందించుటకు ఎంఎస్ స్వామినాథన్ రీసర్చ్ ఫౌండేషన్ ఐఐటీ మద్రాస్, శ్రీచర్ ఇన్స్టిట్యూట్ అఫ్ హైయర్ ఎడ్యుకేషన్ చెన్నై ముందుకు రావటం జరిగింది. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న, సీఎంహెచ్వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఎమ్మెస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ప్రతిభా గణేషన్, రాజమోహన్ రెడ్డి, సంస్థల ప్రతినిధులు హర్షవర్ధన్, అరవింద్, గౌతమ్ కృష్ణ , ఇందుమతి, తానీషి పొన్నమ్మ, అన్నపూర్ణ కశ్యప్, ప్రీతి, దివ్య, మాలవి, తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై హర్షం

**ఏలూరు జిల్లాచింతలపూడి, మహా** : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం క్యాబినెట్‌లో ఆమోదం తెలపడం హర్షణీయమని చింతలపూడి మండల టీడీపీ అధ్యక్షుడు చింతం విష్ణు అన్నారు.బుధవారం చింతలపూడి మినీ బస్టాండ్ వద్ద కూటమి పార్టీలకు చెందిన బీసీ నాయకుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ఏలూరుఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా చింతం విష్ణు మాట్లాడుతూ బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం బీసీల సంక్షేమం, రాజకీయ సాధికారతకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు.కార్యక్రమంలో కూటమి బీసీ నేతలు తాటి అప్పారావు, కొమ్మరాజు సత్యనారాయణ, యువరాజు, పులిపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ANN తెలుగు

మహా పత్రిక

గురువారం, హైదరాబాద్
20-08-2026

మహా ప్రత్యేకం

04

# పల్లె పల్లెకు పొన్నం



## ప్రజాపాలనకు నిర్వచనం



## ప్రజల గడప వద్దకే మంత్రి

### హుస్నాబాద్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం

### ప్రజల మధ్యే పాలన.. సమస్యలపై అక్కడికక్కడే పరిష్కారం

### తెలంగాణలోనే ఆదర్శం

పదవి అనే గద్దెపై కూర్చొని పాలన చేయడం కాదు.. పల్లె గడప తొక్కి ప్రజల గుండె చప్పుడు వినడమే అసలైన ప్రజాపాలన అని చాటిచెబుతూ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ నియోజకవర్గంలో చేపట్టిన "పల్లె పల్లెకు పొన్నం అన్న-పల్లె పల్లెల్లో ప్రజా పాలన" కార్యక్రమం తెలంగాణ రాష్ట్రంలో సరికొత్త అధ్యాయానికి నాంది పలుకుతోంది. మంత్రి పొన్నం ప్రభాకర్ తనను ఎన్నుకున్న ప్రజల వద్దకే స్వయంగా వెళ్లి, ఒక్కో పల్లెను పలకరిస్తూ, సమస్యల గుండెచప్పుడు వింటూ, అధికార యంత్రాంగాన్ని ప్రజల ముందుకు తీసుకువచ్చి, సాధ్యమైన సమస్యలకు అక్కడికక్కడే పరిష్కార బాట వేయడం.. మిగిలిన సమస్యలకు గడువు నిర్దేశించి వాటి పరిష్కారం వరకు వెన్నంటి నిలవడం ఇప్పటివరకు కనిపించిన సంప్రదాయ రాజకీయ పర్యటనలకు పూర్తిగా భిన్నమైన ప్రజా సేవా ప్రయోగం. 173 గ్రామాల గడపలను తట్టే ఈ పల్లెబాట కేవలం మంత్రి పర్యటన కాదు.. ప్రజల వద్దకు పాలనను తీసుకెళ్లే పరిపాలనా విప్లవం.. ప్రజల మాటను ప్రభుత్వ నిర్ణయంగా మలిచే ప్రజాస్వామ్య ప్రక్రియ.. ప్రజాప్రతినిధి బాధ్యతకు కొత్త నిర్వచనం. తెలంగాణలో ఇప్పటివరకు ఏ మంత్రి చేపట్టని రీతిలో తన నియోజకవర్గాన్ని గ్రామం గ్రామంగా చుట్టి ప్రజల మధ్యే పాలనకు శ్రీకారం చుట్టిన పొన్నం ప్రభాకర్ అడుగు.. ఆదర్శనీయం, ఆచరణీయం, చారిత్రాత్మకం.. ముఖ్యంగా ప్రజా సమస్యే తన కార్యసూచిగా, ప్రజల పరిష్కారమే తన లక్ష్యంగా సాగుతున్న ఈ వినూత్న పల్లె ప్రయాణం రేపటి ప్రజాపాలనకు మార్గదర్శకంగా నిలిచే విప్లవాత్మక ప్రయత్నంగా నిలుస్తోంది. బుధవారం కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలో ఈ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు.ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధి ఐదేళ్లకు ఒకసారి ఓటు కోసం ప్రజల ముందుకు రావడం కాదు.. ప్రజల కష్టాలు, కన్నీళ్లు, అవసరాలు తెలుసుకునేందుకు నిరంతరం వారి మధ్యే ఉండాలి. పాలన అంటే కార్యాలయాల్లో కూర్చొని ఫైళ్లపై సంతకాలు చేయడం కాదు.. ప్రజల గడప వద్దకు వెళ్లి వారి సమస్యలను స్వయంగా వినడం.. పరిష్కార మార్గాలను అక్కడికక్కడే చూపించడం. ఈ భావనకు ఆచరణ రూపం ఇస్తూ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ నియోజకవర్గంలో చేపట్టిన "పల్లె పల్లెకు పొన్నం అన్న - పల్లె పల్లెల్లో ప్రజా పాలన" కార్యక్రమం ఆదర్శంగా నిలుస్తుంది. తెలంగాణ రాజకీయ, పరిపాలనా చరిత్రలో ఒక రాష్ట్ర మంత్రి తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని స్వయంగా సందర్శిస్తూ.. ప్రజలతో ముఖాముఖి నిర్వహిస్తూ.. వారి సమస్యలను నమోదు చేసి.. సంబంధిత అధికారులను అదే వేదికపైకి తీసుకువచ్చి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించడం అరుదైన ప్రయోగంగా నిలుస్తోంది. అందుకే ఈ కార్యక్రమం సాధారణ పర్యటన కాదు.. ప్రజాప్రతినిధి తన బాధ్యతను ప్రజల మధ్య నిర్వర్తిస్తున్న ప్రజాస్వామ్య ప్రయోగం.






### పల్లె బాట పట్టిన మంత్రి

హుస్నాబాద్ నియోజకవర్గంలోని 173 గ్రామాలను లక్ష్యంగా చేసుకుని ప్రారంభించిన ఈ కార్యక్రమానికి తొలిరోజు సైదాపూర్ మండలం వేదికైంది. ఉదయం దుద్దెనపల్లి నుంచి ప్రారంభమైన మంత్రి పర్యటన.. ఎక్లాస్‌పూర్, సోమారం, వెన్నంపల్లి, ఆరెపల్లి గ్రామాల వరకు కొనసాగింది. ప్రతి గ్రామంలో ప్రజలు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులతో మంత్రి నేరుగా మాట్లాడారు. గ్రామంలో ఏ సమస్య ఉంది? ఏ పని పెండింగ్‌లో ఉంది? ఎవరికి సంక్షేమ పథకం అందలేదు? రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఏమిటి? తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, విద్య, వైద్యం, సాగునీటి పరిస్థితి ఎలా ఉంది? వంటి అంశాలను క్షేత్రస్థాయిలో తెలుసుకున్నారు. ఇది కేవలం వినతిపత్రాలు స్వీకరించే కార్యక్రమంగా కాకుండా.. సమస్యను వినడం - నమోదు చేయడం - సంబంధిత అధికారిని గుర్తించడం - పరిష్కారానికి గడువు నిర్ణయించడం - తిరిగి సమీక్షించడం అనే విధానంతో ముందుకు సాగడం ఈ కార్యక్రమానికి ప్రత్యేకత.









### ప్రజల మధ్యే పాలన..

"ప్రజాపాలన అంటే కార్యాలయాల్లో కూర్చొని పాలన చేయడం కాదు.. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే ప్రజాపాలన" అన్న మంత్రి పొన్నం ప్రభాకర్ మాటలు ఈ కార్యక్రమం ఉద్దేశాన్ని స్పష్టంగా చెబుతున్నాయి. ప్రతి గ్రామంలో ప్రధానంగా ఐదు కీలక సమస్యలను గుర్తించి వాటికి సంబంధిత శాఖ, అధికారి, నిధులు, చేపట్టాల్సిన చర్య, పూర్తి చేయాల్సిన గడువును నిర్ణయించే విధానం తీసుకురావడం ద్వారా సమస్యల పరిష్కారాన్ని బాధ్యతాయుతంగా మార్చే ప్రయత్నం జరుగుతోంది. కార్యక్రమం ముగిసిన తర్వాత సమస్యలను వదిలేయకుండా.. 24 గంటల్లో నివేదిక, 7, 15, 30 రోజుల వ్యవధిలో సమీక్షలు నిర్వహించేలా పర్యవేక్షణ వ్యవస్థను రూపొందించడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

### దుద్దెనపల్లిలో అభివృద్ధికి అద్దం

దుద్దెనపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానను మంత్రి ప్రారంభించారు. అనంతరం రైతు వేదికలో ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్, రేషన్ కార్డులు, భూ భారతి, కళ్యాణ లక్ష్మి, స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సహాయం వంటి పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలును వివరించారు.అదేవిధంగా దుద్దెనపల్లి-మొగిలిపల్లి బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.56 కోట్లు మంజూరు కావడం, గ్రామ పంచాయతీ భవనం, జిమ్, గ్రామ సమైక్య భవనం వంటి మౌలిక వసతుల పై మంత్రి వెల్లడించిన వివరాలు గ్రామాభివృద్ధి దిశను చూపుతున్నాయి.

### 173 గ్రామాలు.. ఒకే లక్ష్యం

హుస్నాబాద్ నియోజకవర్గంలోని 173 గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకోవాలనే లక్ష్యంతో మంత్రి పొన్నం ప్రభాకర్ చేపట్టిన ఈ కార్యక్రమం ముందుకు సాగనుంది. ప్రజల మధ్య ఉండే నాయకత్వం.. ప్రజల సమస్యలను వినే పాలన.. పరిష్కారానికి కట్టుబడి ఉండే అధికార యంత్రాంగం.. నిరంతర పర్యవేక్షణ.. ఈ నాలుగు అంశాలు కలిస్తేనే ప్రజాపాలనకు నిజమైన అర్థం వస్తుంది.ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధి.. ప్రజల మధ్యే ఉండి.. ప్రజల సమస్యలే తన కార్యాచరణగా మార్చుకుంటే ప్రజాస్వామ్యానికి అసలైన అర్థం వస్తుంది. ఆ దిశగా హుస్నాబాద్‌లో ప్రారంభమైన ఈ వినూత్న కార్యక్రమం తెలంగాణలో ప్రజాపాలనకు ఒక ఆదర్శ నమూనాగా నిలుస్తుంది. పాలనను ప్రజల వద్దకు తీసుకెళ్లే ఆలోచనకు పల్లె బాట పట్టిన పొన్నం ప్రభాకర్ కార్యక్రమం కొత్త నిర్వచనం ఇస్తోంది.

**ఎక్లాస్‌పూర్‌లోనూ అదే స్ఫూర్తి**

ఎక్లాస్‌పూర్‌లో రూ.20 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానను ప్రారంభించిన మంత్రి.. అనంతరం గ్రామ ప్రజలతో నేరుగా మాట్లాడారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సబ్సిడీ, రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీ, రేషన్ కార్డులు, పింఛన్లు, స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సహాయం వంటి పథకాల లబ్ధిని వివరించారు. అర్హత ఉన్నా సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వారికి ప్రయోజనం అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

**రైతు బాట.. ప్రత్యామ్నాయ పంటల వైపు అడుగులు**

వర్షాభావ పరిస్థితుల్లో నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి పిలుపునిచ్చారు. జలసిరి కార్యక్రమం ద్వారా ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ ఇంజెక్షన్ పాయింట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

వరి సాగుపై మాత్రమే ఆధారపడకుండా ఆరుతడి పంటలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ, లాభదాయక పంటల వైపు రైతులు అడుగులు వేయాలని సూచించడం ద్వారా వ్యవసాయ రంగంలోనూ కొత్త ఆలోచనకు ప్రాధాన్యత ఇచ్చారు. 200 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగును పూర్తి చేసిన గ్రామ పంచాయతీలకు రూ.5 లక్షల అభివృద్ధి నిధులు అందిస్తామని ప్రకటించడం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా మరో అడుగు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, డయాలసిస్, హెచ్‌ఐవీ, బోదకాలు, తలసేమియా తదితర వర్గాలకు చెందిన అర్హులకు పింఛన్లు అందేలా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని మంత్రి తెలిపారు."అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలి" అనే లక్ష్యంతో గ్రామ స్థాయిలోనే సమస్యలను గుర్తించడం ఈ కార్యక్రమానికి మరో ముఖ్యమైన బలం. ఒక గ్రామంలో సమస్య ఉందంటే దాని పరిష్కారం కోసం ప్రజలు మండల కార్యాలయం, జిల్లా కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా.. అధికార యంత్రాంగాన్ని గ్రామానికే తీసుకురావడం ఈ కార్యక్రమంలోని వినూత్న అంశం. తాగునీటి నుంచి డ్రైనేజీ వరకు.. రోడ్ల నుంచి విద్యుత్ వరకు.. పాఠశాలల నుంచి ఆరోగ్య కేంద్రాల వరకు.. చెరువుల నుంచి సాగునీటి ప్రాజెక్టుల వరకు ప్రతి అంశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించే విధానం ప్రజాపాలనకు కొత్త అర్థాన్ని ఇస్తోంది.



**దీర్ఘకాలిక సమస్యలకు రాష్ట్రస్థాయిలో పరిష్కారం**

గౌరవెల్లి ప్రాజెక్టు, సాగునీటి కాలువలకు భూసేకరణ, ఎల్‌ఎండీ నుంచి వచ్చే నీటి ప్రాజెక్టు, ఎంఎంఆర్ కింద పెండింగ్‌లో ఉన్న పనులు వంటి దీర్ఘకాలిక అంశాలను రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి, కేబినెట్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని మంత్రి ప్రకటించారు. అంటే గ్రామ సమస్యను గ్రామస్థాయిలోనే ఆపకుండా.. అవసరమైతే మండలం, జిల్లా, రాష్ట్రస్థాయికి తీసుకెళ్లి పరిష్కరించే బహుస్థాయి విధానం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ఒక ప్రజాప్రతినిధి తన నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని సందర్శించడం ఒక సాధారణ రాజకీయ కార్యక్రమం కావచ్చు. కానీ ప్రతి గ్రామంలో ప్రజలతో కూర్చొని వారి సమస్యలు వినడం.. అధికారులను సమన్వయం చేయడం.. పరిష్కారానికి గడువు పెట్టడం.. తిరిగి ఆ సమస్య పరిష్కారమైందా లేదా అని పర్యవేక్షించడం మాత్రం భిన్నమైన ప్రజా సేవా విధానం. అందుకే "పల్లె పల్లెకు పొన్నం అన్న" కార్యక్రమాన్ని కేవలం రాజకీయ పర్యటనగా కాకుండా.. ప్రజా ప్రతినిధిత్వానికి కొత్త నమూనాగా చూడాల్సిన అవసరం ఉంది.



## స్వాతి జన్మ నక్షత్రం సందర్భంగా గిరిప్రదక్షిణ

- **పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**

**యాదాద్రి భువనగిరి ఆగష్టు 19 మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి స్వాతి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అధికారులు ఆధ్వర్యంలో బుధవారం గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆలేరు ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పాల్గొన్నారు.వేకువజామున ఆలయ ముఖ మండపంలో అర్చకులు శతఘటాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య , ఆలయ ఈవో భవాని శంకర్ తో కలిసి గిరిప్రదక్షిణను ప్రారంభించారు.స్వాతి జన్మ నక్షత్రం సందర్భంగా నిర్వహించిన ఈ గిరిప్రదక్షిణలో వేలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. గోవింద నామస్మరణలు, భక్తుల ఆధ్యాత్మిక సందడితో యాదగిరిగుట్ట పరిసరాలు మార్మోగాయి.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందుతూ గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు.




## మండల స్థాయి సమీక్ష సమావేశం

**ఎంపీడీవో జలంధర్ రెడ్డి**

**వడిగొండ ఆగస్టు 19 మహా న్యూస్** : వలిగొండ మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మండల ఎంపీడీవో జలంధర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులు వాటి పురోగతి నిర్దేశిత లక్ష్యాలు సాధన పై సమగ్ర సమీక్ష నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి వై హేమలత పి ఆర్ ఏ ఈ సందీప్ రెడ్డి ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ కె శ్రీ కీర్తి ఏపీవో పరశురాములు వివిధ శాఖల అధికారులు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు




## రోడ్డు ఆక్రమణలపై అధికారుల ఉక్కుపాదం.!

- **స్థానికుల ఫిర్యాదు మేరకు చర్యలు..!**
- **ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులకు ఇబ్బందులు**
- **ఆక్రమణల తొలగింపుతో సమస్య పరిష్కారం.!**
- **ఆదిభట్ల సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారి రంగనాథ్**

ఇబ్రహీంపట్నం ఆగస్టు 19 మహా: మంగళ్‌పల్లిలో ప్రధాన రహదారిని ఆక్రమించి ఏర్పాటు చేసిన నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు ఉక్కుపాదం మోపారు. ఆదిభట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి సత్యనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని, సాగర్ హైవే మంగళ్‌పల్లి చౌరస్తా నుంచి కొంగరకలాన్ కలెక్టరేట్ వెళ్లే ప్రధాన రహదారి ఇరువైపులా కొందరు వ్యాపారులు అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో, ఈ యొక్క ఆక్రమణలను టౌన్ ప్లానింగ్ అధికారి రఘునాథ్, తన బృందంతో బుధవారం తొలగించారు.

**స్థానికుల ఫిర్యాదు మేరకు చర్యలు..!**

రహదారిపై ఆక్రమణల కారణంగా తరచూ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతూ విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ వచ్చిన ఫిర్యాదులపై అధికారులు ఈ చర్యలు చేపట్టారు. ఆక్రమణల తొలగింపు సందర్భంగా కొంతమంది స్థానికుల నుంచి వ్యతిరేకత వచ్చినప్పటికీ అధికారులు వెనక్కి తగ్గకుండా కూల్చివేతలను కొనసాగించారు. రహదారులపై ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగించే విధంగా రహదారులను ఆక్రమించి ఏర్పాటు చేసిన నిర్మాణాలను పూర్తిగా తొలగిస్తామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని టౌన్ ప్లానింగ్ అధికారులు హెచ్చరించారు. రహదారులు, ఫుట్‌పాత్‌లు ప్రజల వినియోగానికే ఉండేలా ఆక్రమణలపై నిరంతరం చర్యలు చేపడతామని తెలిపారు.

**అందరికీ ఒకేలా న్యాయం జరగాలి.?**

రహదారిపై ఉన్న ఆక్రమణలను తొలగించడాన్ని స్థానికులు, దుకాణ యజమానులు తీవ్రంగా వ్యతిరేకించారు. రోడ్డుకు ఇరువైపులా అన్ని దుకాణ సముదాయాల ముందు ఉన్న ఆక్రమణలను తొలగించాలని వారు కోరుతున్నారు. కొందరి దుకాణాల ముందు మాత్రమే ఆక్రమణలు తొలగిస్తున్నారని, రోడ్డుకు ఇరువైపులా ఉన్న అన్ని అక్రమ నిర్మాణాలపై సమానంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.




## విశ్వశాంతి విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

**సత్తుపల్లి, ఆగస్టు 19:మహా :** పట్టణ పరిధిలోని విశ్వశాంతి విద్యాలయంలో మంగళవారం విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. స్థానిక హీనా ఐ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ హీరాలాల్ నేతృత్వంలో ఈ వైద్య పరీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా సుమారు 40 మంది విద్యార్థులకు కంటి చూపులో లోపాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. కంటి ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన ఆహారపు అలవాట్లు, పోషకాహారం, కంటి సంరక్షణపై విద్యార్థులకు వైద్యులు అవగాహన కల్పించారు. హీనా కంటి వైద్య నిపుణులు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో విశ్వశాంతి స్కూల్ నిర్వాహకులు పసుపులేటి నాగేశ్వరరావు, సత్యనారాయణ, ఉపాధ్యాయులు, హీనా ఐ కేర్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి దామోదర రాజనర్సింహకు ఎమ్మెల్యే విజ్ఞప్తి



**కుషాయిగూడ, మహా :** నియోజకవర్గ ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌తో పాటు సమగ్ర డయాగ్నస్టిక్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం సమర్పించారు.. ఉప్పల్ నియోజకవర్గంలో జనాభా వేగంగా పెరుగుతున్నా ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్, పూర్తిస్థాయి డయాగ్నస్టిక్ సెంటర్ అందుబాటులో లేవని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు సీబీసీ, రక్తంలో చక్కెర, కాలేయం, మూత్రపిండాల పరీక్షలు, అల్ట్రాసౌండ్ వంటి పరీక్షల కోసం ప్రైవేటు కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తుండటంతో ఆర్థిక భారం పడుతోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన పరీక్షల సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కాంపోనెంట్ విభజన సదుపాయంతో కూడిన ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌తో పాటు పాథాలజీ, రేడియాలజీ, అల్ట్రాసౌండ్ తదితర సేవలతో కూడిన డయాగ్నస్టిక్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సదుపాయాలు అందుబాటులోకి వస్తే ఉప్పల్‌తో పాటు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని, అత్యవసర వైద్య సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. సంబంధిత అధికారులను ఆదేశించి వీటి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయి జెన్‌శేఖర్, గంధం నాగేశ్వరరావు, జెట్ట కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

## బీసీఐ చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా వెంటనే రాజీనామా చేయాలి

- **ఆగస్టు 21న రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల వద్ద నిరసనలు**
- **ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి పిలుపు**



భువనగిరి: ఆగస్టు 19 మహా న్యూస్ : బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా అనుసరిస్తున్న ఏకపక్ష, అప్రజాస్వామిక, రాజకీయ పక్షపాత వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆయన వెంటనే బీసీఐ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (AILU) రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. మనన్ కుమార్ మిశ్రా పద్నాలుగు సంవత్సరాలకు పైగా బీసీఐ చైర్మన్‌గా కొనసాగుతూ, చట్టబద్ధమైన ప్రజాస్వామిక సంస్థలో అధికారాన్ని వ్యక్తిగతంగా కేంద్రీకరించడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏ రాజకీయ పార్టీకి లేదా ప్రభుత్వానికి అనుబంధ సంస్థ కాదని, దేశంలోని న్యాయవాదులందరికీ ప్రాతినిధ్యం వహించాల్సిన స్వతంత్ర చట్టబద్ధ సంస్థ అని తెలిపారు. బీసీఐ అధికారిక పదవి, లెటర్‌హెడ్‌ను రాజకీయ ప్రకటనలకు ఉపయోగించడం సంస్థ స్వతంత్రతను, విశ్వసనీయతను దెబ్బతీస్తుందని విమర్శించారు.నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 2026 బ్యాచ్ పట్టభద్రులను న్యాయవాదులుగా నమోదు చేయవద్దని రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు ఆదేశాలు జారీ చేయడం పూర్తిగా ఏకపక్షమైన, చట్టవిరుద్ధమైన చర్యగా పేర్కొన్నారు. కొంతమంది విద్యార్థులు శాంతియుతంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినందుకు మొత్తం బ్యాచ్‌ను శిక్షించడం రాజ్యాంగ విలువలకు, న్యాయవాదుల చట్టం-1961 నిబంధనలకు విరుద్ధమన్నారు. అనంతరం ఆదేశాలను ఉపసంహరించుకొని క్షమాపణ చెప్పినప్పటికీ, విద్యార్థుల వృత్తిపరమైన భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టిన బాధ్యత నుంచి చైర్మన్ తప్పించుకోలేరని స్పష్టం చేశారు.ప్రజాస్వామికంగా ఎన్నికైన రాష్ట్ర బార్ కౌన్సిళ్ల స్వతంత్రతలో జోక్యం చేసుకోవడం, ఎన్నికల్లో ఓడిపోయిన వ్యక్తులను నామినేషన్ల ద్వారా అధికార స్థానాల్లో నియమించడం, ఎన్నికల ఫలితాల తర్వాత సభ్యుల సంఖ్యను పెంచి ఓడిపోయిన అభ్యర్థులను కౌన్సిళ్లలోకి తీసుకురావడానికి ప్రయత్నించడం ప్రజాస్వామిక సూత్రాలకు విరుద్ధమన్నారు. న్యాయవిద్య ప్రమాణాలు, న్యాయ కళాశాలల తనిఖీలు, అనుమతులు, విరాళాల సేకరణకు సంబంధించి వస్తున్న తీవ్రమైన ఆరోపణలపై స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.బీసీఐ ప్రజాస్వామిక, స్వతంత్ర, చట్టబద్ధ స్వభావాన్ని పరిరక్షించేందుకు, మనన్ కుమార్ మిశ్రా రాజకీయ పక్షపాత-అప్రజాస్వామిక వ్యవహారశైలికి నిరసనగా 2026 ఆగస్టు 21న రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల వద్ద న్యాయవాదులు నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని మామిడి వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసనలను విజయవంతం చేయాలని కోరారు.బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కోల్పోయిన గౌరవం, విశ్వసనీయత, ప్రజాస్వామిక స్వభావాన్ని పునరుద్ధరించేందుకు మనన్ కుమార్ మిశ్రా వెంటనే బీసీఐ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఐలు జిల్లా గౌరవ అధ్యక్షులు కుక్కదువ్వ సోమయ్య, జిల్లా అధ్యక్షులు బొల్లెపల్లి కుమార్, ఉపాధ్యక్షులు తడక మోహన్, పాల్వంచ జగతయ్య, ఎం.డి. నేహాల్, సహాయ కార్యదర్శి సీసా శ్రీనివాస్, నాయకులు సూరగాని శ్రీహరి, చింతల రాజశేఖర్ రెడ్డి, బొడ్డు కిషన్, భాస్కర్ రెడ్డి, ఐలయ్య, మల్లేష్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలు, సామాజిక రుగ్మతల పరిరక్షణలో కాలనీల సహకారం అవసరం

**జవహర్ నగర్ ఏసిపి చక్రపాణి**

**కుషాయిగూడ, మహా :** శాంతి భద్రతలు, సామాజిక రుగ్మతల పరిరక్షణలో కాలనీవాసుల సహకారం ఎంతో అవసరమని జవహర్ నగర్ ఏసిపి చక్రపాణి పేర్కొన్నారు. జవహర్ నగర్ కేసీఆర్ కూరగాయల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మునగాల నరసింహ ఆధ్వర్యంలో బుధవారం కాలనీలలో చుట్టుపక్కల డ్రగ్స్ గంజాయి తదితర సేవనంలో యువత మునిగి తేలుతున్న పరిస్థితులను కాలనీ వాసులు ఎసిపికి వివరించారు. రాత్రి సమయాలలో మహిళలు, విద్యార్థులు బయటికి రావడానికి గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల నిందితుల వల్ల భయభ్రాంతులకు గురవుతున్నామని, తక్షణమే పెట్రోలింగ్ వాహనాలను ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానిక నేతలు ఏసీపీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రగతి నగర్, నందమూరి నగర్ తదితర ప్రాంతాలలో గంజాయి పోకిరీల బెడద విపరీతంగా పెరిగిపోయిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపి యువతను కాపాడాలని, కోరారు. దీనికి కాలనీ వాసుల మైన మేము పోలీసులకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

## నైట్రాజెపామ్ టాబ్లెట్ల అక్రమంగా విక్రయిస్తున్న. ముగ్గురి అరెస్ట్

- **10 ఎంజీ 1,840 నైట్రాజెపామ్ టాబ్లెట్లు..**
- **3 సెల్‌ఫోన్లు స్వాధీనం..**

**రాజేంద్రనగర్ మహా ;** ప్రిస్క్రిప్షన్ మందుగా వినియోగించే నైట్రాజెపామ్10 ఎంజీ టాబ్లెట్లను అక్రమంగా కొనుగోలు చేసి విక్రయిస్తున్న ముగ్గురిని టాస్క్‌ఫోర్స్ రాజేంద్రనగర్ జోన్, కామాటిపుర లా అండ్ ఆర్డర్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈ నెల 18న గార్స్ ఆస్పత్రి సమీపంలో మహ్మద్ అష్ఫాక్ (27)ను అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి 800 టాబ్లెట్లు స్వాధీనం చేసుకున్నారు.విచారణలో అష్ఫాక్ ఇచ్చిన సమాచారంతో మంగర్‌బస్తీకి చెందిన హతగలే రామ్‌జానే (20), అత్తాపూర్‌కు చెందిన మహ్మద్ ఇమ్రాన్ (31)లను పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 140, 900 నైట్రాజెపామ్10 టాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 1,840 టాబ్లెట్లు (184 స్ట్రిప్స్), మూడు మొబైల్ ఫోన్లు, రూ.1,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాటి విలువ సుమారు రూ.1.23 లక్షలు ఉంటుందన్నారు.నిందితులు ఒక్కో టాబ్లెట్‌ను సుమారు రూ.20కి కొనుగోలు చేసి రూ.50కి విక్రయిస్తున్నారు.ఈ వ్యవహారానికి సంబంధించి రోహన్, కరణ్, నదే అజయ్ ప్రధాన సరఫరాదారులుగా దర్యాప్తులో వెల్లడైంది. ప్రస్తుతం పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.ఈ ఘటనపై కామాటిపుర పోలీస్‌స్టేషన్‌లో ఎన్ డి పిఎస్ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. నైట్రాజెపామ్ వంటి సైకోట్రోపిక్ పదార్థాల అక్రమ విక్రయం, సరఫరాపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. NDPS చట్టంలో సైకోట్రోపిక్ పదార్థాల అక్రమ స్వాధీనం, విక్రయం, సరఫరాపై కఠినమైన నిబంధనలు ఉన్నాయి. రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్.శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ కేఎస్ రావు పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న ప్రధాన సరఫరాదారులను అరెస్టు చేసేందుకు పలు బృందాలను ఏర్పాటు చేశామని పోలీసులు తెలిపారు.





## మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి..

- **గ్రామపంచాయతీ కార్మికుల రిలే నిరాహార దీక్ష..**
- **కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని డిమాండ్**

**మణుగూరు, మహా :** గ్రామపంచాయతీల్లో అమలు చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి, కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సత్రపల్లి సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షను సీఐటీయూ మండల కన్వీనర్ కొడిశాల రాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా వేతనాలు జమ చేయాలని కోరారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ, అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్న పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. అధికారంలోకి వస్తే గ్రామపంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి కనీస వేతనాలు అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్నా కార్మికుల సమస్యలు పరిష్కారం కాకపోవడం బాధాకరమన్నారు. కార్మికుల శ్రమను ప్రభుత్వం దోచుకుంటోందని ఆరోపిస్తూ, కనీస వేతనాన్ని నెలకు రూ.26 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పిట్టల నాగమణి, రైతు సంఘం మండల అధ్యక్షుడు సంకినేని వెంకటరావు, సదానందం, రంగా, దొడ్డి శంకరయ్య తదితర నాయకులతో పాటు మండలంలోని 14 గ్రామపంచాయతీలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.



## సర్వే నెంబర్ 106 సర్వే చేయించి కాపాడాలి.!

- భూ బకాసురుల కన్ను కబ్జాకు యత్నం!
- మంతన్ గౌడ్ రెవెన్యూ పరిధిలో దారుణం
- డిప్యూటీ తాసిల్దార్ కు ఫిర్యాదు: సిపిఎం

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 19 మహా:** మంతన్ గౌడ్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 106 ప్రభుత్వ అసైన్మెంట్ భూమిలో అక్రమంగా కబ్జాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తాసిల్దార్ కీర్తి సాగర్ కు ఫిర్యాదు. యాచారం మండలం, మంతన్ గౌరెల్లి గ్రామపంచాయతీ పరిధి, మంతన్ గౌడ్ రెవెన్యూలోని సర్వే నెంబర్ 106 అసైన్మెంట్ ప్రభుత్వ భూమిని అక్రమంగా కబ్జాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, గ్రామానికి చెందిన సిపిఎం నాయకులు, మండల డిప్యూటీ తాసిల్దార్ కీర్తి సాగర్ కు మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ చందు నాయక్, మాజీ సర్పంచ్ విజయలక్ష్మి కిషన్ నాయక్, మాజీ ఎంపిటిసి తావు నాయక్ మాట్లాడుతూ... గ్రామపంచాయతీ పరిధిలోని, మంతన్ గౌడ్ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 106 అసైన్మెంట్ ప్రభుత్వ భూమిని, కొంతమంది భూబకాసురులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై ఈ యొక్క భూమిలో ఉన్న చెట్లను తొలగించి, చదును చేసి, అక్రమంగా కబ్జాకు పాల్పడుతున్న వారి తీరుపై తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. మండల రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి 106 సర్వే నెంబర్ను సర్వే చేయించి హద్దు రాలు నాటించి, ఆ యొక్క భూమిని రక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామంలో ఉన్న పేద ప్రజలను కలుపుకొని తాసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ నెంబర్ రోజా నరసింహ, మాజీ వార్డ్ నెంబర్ మాన్ సింగ్, నాయకులు కే గణేష్, ఎన్ శంకర్, బి జంగయ్య కే కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు,పిల్లలకు లైన్స్ క్లబ్ అన్నదానం




**మందమర్రి, మహా :** మందమర్రి లయన్స్ క్లబ్ అధ్యక్షులు పెండ్యాల గౌతమ్ చారి తనయుడు రుద్ర పుట్టిన రోజు సందర్భంగామంచిర్యాల సున్నం బట్టి వాడలోని ఆనందా నిలయంలో 80 మంది వృద్ధులకు, పిల్లలకు అన్నదానం, పండ్ల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్ డిస్ట్రిక్ట్ చైర్మన్ సోతుకు సుదర్శన్ అధ్యక్షులు పెండ్యాల గౌతమ్ చారిలు ముందుగా పెండ్యాల రుద్ర కు ఆయన జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ మందమర్రి లయన్స్ క్లబ్ కు నూతన అధ్యక్షుడిగా గౌతమ్ చారి ఎన్నికైన తర్వాత సేవా కార్యక్రమాల లో ముందు వరసలో నిలవడం అభినందనీయమని అన్నారు. ఈ లైన్స్ క్లబ్ ద్వారా సేవ చేయడం అనేది పూర్వజన్మ సుకృతమని వెల్లడించారు. ఇలాంటి ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టి క్లబ్ సేవలను విస్తృతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుల కుటుంబ సభ్యులు పెండ్యాల రాములు, స్వరూప, వర్షిత, శ్రీ కృతి, లయన్స్ క్లబ్బు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## కార్పొరేషన్ ఆఫీస్ కనిపించేటట్టు చర్యలు తీసుకోండి

- పలు సమస్యలపై ప్రజావాణిలో వినతి పత్రం అందించిన మునిగడప

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** కార్పొరేషన్ ఆఫీసును ప్రజలు గుర్తుపట్టే విధంగా ప్రహరీ గోడను ఎత్తుగా నిర్మాణం చేసి దానిపై పరిశుభ్రత ప్రభుత్వ పథకాల బొమ్మలను వేసి సుందరంగా తీర్చిదిద్దాలని మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునగడప వెంకటేశ్వర్లు ప్రజావాణిలో కమిషనర్, మేయర్ కు వినతి పత్రాన్ని అందించారు. బుధవారం కార్పొరేషన్ ఆఫీసులో వినతిపత్రాన్ని అందించిన అనంతరం మునిగడప మాట్లాడుతూ కార్పోరేషన్ పరిధిలోని సుదీర ప్రాంతాల నుండి వారి అవసరాల నిమిత్తం వచ్చే ప్రజలకి కార్పొరేషన్ ఆఫీస్ ను గుర్తు పట్టక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. ఈ సమస్యతో పాటుగా కోతులు కుక్కలు పందుల సమస్య విపరీతంగా ఉందని కోతులు కుక్కల బారి నుండి ప్రజలను కాపాడాలని అన్నారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పందుల సంచారాన్ని నివారించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.



## మాలలకు అన్యాయం జరుగుతుంది

- మంత్రి వివేక్ కు మద్దెల వినతిపత్రం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**:వర్గీకరణలో మాలలకు అన్యాయం జరిగిందని ఈ విషయంలో ఆలోచన చేసి మాలలకు న్యాయం జరిగే విధంగా చూడాలని కోరుతూ మంత్రి వివేక్ కు వినతి పత్రం అందించినట్లుగా ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ హేతుబద్ధంగా శాస్త్రీయబద్ధంగా జరగలేదని ఎస్సీలలో ఒక వర్గాన్ని మాత్రమే సంతృప్తిపరిచి సంతోషపెట్టడానికి ప్రభుత్వాలు పరుగులు తీసి ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ తీసుకొచ్చాయని అన్నారు. విద్యా ఉద్యోగాలలో మాలలకు రోస్టర్ పాయింట్లు పెంచాలని సూచించారు. చేవెళ్ల డిక్లరేషన్ను అనుసరించి ఎస్సీ కార్పొరేషన్ కు కేటాయించిన నిధులను ఎస్సీల అభివృద్ధికి ఖర్చు చేయాలని డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తెలంగాణ రాష్ట్ర కార్మిక ఉపాధి గనులు పరిశ్రమల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామికి అందించినట్లుగా భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ పేర్కొన్నారు. దళిత జాతికి విస్తృతమైన విశిష్టమైన సేవలను అందిస్తున్నందుకుగాను ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ ను మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల వెంకటేశ్వరరావును మంత్రి శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు.




## విద్యను నిర్వీర్యం చేసే ఆలోచన వద్దు

- యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం ప్రతిపాదన సరి కాదు
- జీవో 97ను రద్దు చేసి శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలి
- ఏఐఎస్ఎఫ్ కలెక్టరేట్ ముట్టడి విజయవంతం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సాంకేతిక విద్యాశాఖను నిర్వీర్యం చేసే నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్ కె షాహిద్, వరక అజిత్ డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని కోరారు.బుధవారం జిల్లా కలెక్టరేట్ ముందు ఆందోళన నిర్వహించి ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో 97ను రద్దు చేయడంతో పాటు విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాంకేతిక విద్యను బలోపేతం చేసి విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయాల వల్ల విద్యార్థులు ఈసెట్ ప్రవేశ పరీక్ష రాసే అర్హత కోల్పోయి కార్పొరేట్ కంపెనీల్లో తక్కువ వేతనాలకే పనిచేసే పరిస్థితులు దాపురిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. డిప్లొమా విద్యార్థులకు ఎంతో కాలంగా అమల్లో ఉన్న లాటరల్ ఎంట్రీ విధానాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. 1957 నుంచి ఎంతో మంది సాంకేతిక నిపుణులను తీర్చిదిద్దిన పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను కాపాడుకునేందుకు పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్, జిల్లా ఉపాధ్యక్షులు కొరిమి సంజయ్, జిల్లా సమితి సభ్యులు ఉమామహేశ్వర్, రాజు, కమల్, షబ్బీర్, నాయకులు కోమలి, మానస, మన్విత, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ప్రవచనాలు

**మంచిర్యాల, మహా :** నేటి నుంచి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ప్రవచనాలను మంచిర్యాల పట్టణం శ్రీ కోదండ రామాలయంలో తలపెట్టినట్లు ప్రోగ్రాం చైర్మన్ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేషన్ వైస్ ప్రెసిడెంట్ సిరిపురం రాజేష్, కో చైర్మన్ ముక్త శ్రీనివాస్, ఆర్గనైజర్లు కేశెట్టి వంశీకృష్ణ కాచం సతీష్ లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు సమాజానికి అందించిన సందేశం తో పాటు అమ్మవారి జీవిత చరిత్రను మూడు రోజులపాటు అమ్మవారి ఉపాసకురాలు డాక్టర్స్ పూలమాడ సత్యదీప చే ప్రవచనాలు ఉంటాయని వెల్లడించారు. ఈ మూడు రోజులపాటు కార్యక్రమం అనంతరం భోజన వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ హాజరైతరించే వారికి మాత ఆశీస్సులు ఉంటాయని వారు పేర్కొన్నారు.




# అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేయాలి

- ప్రజలకు పూర్తి ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలి.
- దిశా కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి




**ఖమ్మం, మహా:** ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు పూర్తి స్థాయిలో ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని దిశా కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి ఆదేశించారు. పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని, నిధులు, అనుమతులకు సంబంధించిన అంశాలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి అధ్యక్షతన దిశా కమిటీ సమావేశం జరిగింది. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై అధికారులు సమర్పించిన యాక్షన్ టేకన్ రిపోర్టును పరిశీలించిన కమిటీ.. జాతీయ రహదారులు, నీటిపారుదల, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, వ్యవసాయం, మార్కెటింగ్, విద్య, వైద్యం, మహిళా శిశు సంక్షేమం, పౌరసరఫరాలు, గిరిజన సంక్షేమం, మున్సిపాలిటీలు తదితర శాఖల పనుల పురోగతిపై విస్తృతంగా సమీక్షించింది.

**జాతీయ రహదారుల పనులకు వేగం పెంచాలి**

జిల్లాలో కొనసాగుతున్న జాతీయ రహదారుల పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ సూచించారు. భూసేకరణకు సంబంధించిన సమస్యలను త్వరగా పరిష్కరించి పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. పంచాయతీరాజ్ శాఖలో పూర్తయిన పనులను సంబంధిత స్థానిక ఎమ్మెల్యేలకు అప్పగించాలని, ఉపాధి హామీ పథకం కింద మంజూరైన వీఓ భవనాల వివరాలతో నివేదిక అందించాలని ఆదేశించారు.

ఎంపీ ల్యాడ్స్ నిధులతో మంజూరైన తాగునీటి పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించిన ఎంపీ.. అవసరమైన మార్పులు, సవరణలు ఉంటే ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. డీఎంఎఫ్‌టీ నిధుల వినియోగంపై పూర్తి నివేదిక అందించాలని, కమిటీ సమావేశాలను ఇకపై క్రమం తప్పకుండా నిర్వహించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.

**గురుకులాలు, పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు**

.జిల్లాలోని గురుకులాలు, పాఠశాలల్లో ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని రఘురాం రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి మౌలిక వసతులతో పాటు తరగతి గదుల్లో బోధన తీరును కూడా పరిశీలించాలని సూచించారు.

ప్రభుత్వం విద్యార్థుల కోసం భారీగా నిధులు ఖర్చు చేస్తున్నందున ఆ నిధుల ఫలితం క్షేత్రస్థాయిలో విద్యార్థులకు అందుతున్నదా లేదా అన్నది నిరంతరం పర్యవేక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

**సన్నబియ్యం అక్రమాలకు అడ్డుకట్ట**

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా క్షేత్రస్థాయి పర్యవేక్షణను పెంచాలని ఎంపీ ఆదేశించారు. బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సమస్యలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచించారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులపై సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందించాలని, ప్రతి కేంద్రంలో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర సదుపాయాలు పూర్తిస్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉజ్వల పథకానికి అర్హులైన కుటుంబాలను గుర్తించేందుకు సర్వే నిర్వహించాలని సూచించారు.

**విలీన ప్రాంతాల్లో తాగునీటికి ప్రాధాన్యం**

అమృత్ 2.0 కింద చేపడుతున్న పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఎంపీ తెలిపారు. పట్టణాల్లో డ్రైనేజీ, తాగునీటి పనులను ప్రాధాన్యంతో చేపట్టాలని, ముఖ్యంగా మున్సిపల్ కార్పొరేషన్లలో విలీనమైన ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

ఖమ్మం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఎంపీ ఆదేశించారు. పార్కింగ్ సౌకర్యం మెరుగుపరిచేందుకు రైల్వే భూముల మార్పిడి ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు స్టేషన్ అభివృద్ధి పనులను డిసెంబర్ 2026లోగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ల్యాండ్ డెవలప్‌మెంట్ మాస్టర్‌ప్లాన్‌కు త్వరగా ఆమోదం పొందేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

**ఆరోగ్య రంగంపైనా సమీక్ష**

జిల్లాలో 3,968 ప్రసవాలు జరగగా, వాటిలో 1,747 ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగినట్లు అధికారులు తెలిపారు. పోషకాహార పునరావాస కేంద్రం ద్వారా 61 మంది చిన్నారులకు చికిత్స అందించగా, ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం కింద సుమారు 62 వేల మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర మౌలిక వసతులను కల్పిస్తున్నామని, క్షేత్రస్థాయిలో గుర్తించిన లోటుపాట్లను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని అధికారులు తెలిపారు.

**రూ.46 కోట్ల పింఛన్లు..**
**4.73 లక్షల రేషన్ కార్డులు**

జిల్లాలో 1.79 లక్షల మందికి ప్రతి నెల సుమారు రూ.46 కోట్ల మేర పింఛన్లు అందుతున్నాయని కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. ఆగస్టు 31 వరకు కొత్త పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు చెప్పారు.ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద జిల్లాలో 70,620 గ్యాస్ కనెక్షన్లు అందించినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో 4.73 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని, బయోమెట్రిక్ విధానం ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. గత ఏడాది కాలంలో కొత్త రేషన్ కార్డులు జారీ చేసి రెండు లక్షల మందికి పైగా లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు.ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 1,500 కొత్త ఇందిరమ్మ ఇళ్లు, 500 ఇళ్ల పైకప్పుల మార్పిడి పనులు మంజూరు చేయనున్నట్లు అధికారులు సమావేశంలో వెల్లడించారు

**రోడ్లు, సాగునీటి పనుల పురోగతిపై వివరాలు**

వరంగల్-ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం కొనసాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ఏఐబీపీ-ఎస్ఆర్ఎస్‌పీ స్టేజ్-2 కింద ఈ ఏడాది చేపట్టిన 8.6 కిలోమీటర్ల పనుల్లో 41 శాతం పూర్తయినట్లు చెప్పారు. మిగిలిన పనులను రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఈపీసీ విధానంలో పూర్తి చేస్తామని వివరించారు.ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ఫేజ్-1లో రెండు వంతెనలు, 16 రహదారుల పనులు పూర్తయ్యాయని, మరో వంతెన పని పురోగతిలో ఉందన్నారు. ఫేజ్-2లో నాలుగు వంతెనలు మంజూరు కాగా ఒకటి పూర్తయిందని, రెండు టెండర్ దశలో, మరొకటి పురోగతిలో ఉన్నట్లు వివరించారు.నేల సారాన్ని పెంచేందుకు మట్టి పరీక్షలు నిర్వహిస్తున్నామని, సోక్‌పిట్లు, ఫార్మ్ పాండ్ల నిర్మాణాన్ని పెద్దఎత్తున చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు.సమావేశంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఎఫ్‌ఓ అనూజ్ అగర్వాల్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, నామినేటెడ్ సభ్యులు, జిల్లా అధికారులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కేకే కమిటీ ఏబీసీ కేటగిరీలను ఏకకాలంలో గుర్తించాలి

- ఉద్యమకారులకు న్యాయం చేస్తే మరో 10 ఏళ్లు కాంగ్రెస్‌దే అధికారం
- వెంటనే ప్రత్యేక వెబ్‌సైట్ ఓపెన్ చేయాలి
- సంగిశెట్టి క్రిస్టఫర్మలిదశ ఉద్యమకారుడు

**వలిగొండ ఆగస్టు 19: మహా న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియలో భాగంగా ఏ, బీ, సీ కేటగిరీలను ఏకకాలంలో గుర్తించాలని మలిదశ ఉద్యమకారుడు సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు. ప్రభుత్వం ఆలస్యం చేయకుండా వీలైనంత త్వరగా ఉద్యమకారులను గుర్తిస్తే ప్రభుత్వంపై ఉద్యమకారుల్లో విశ్వాసం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.ఉద్యమకారులకు న్యాయం జరిగితే ప్రభుత్వానికి అండగా నిలిచి మరో పది సంవత్సరాలు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో కొనసాగేందుకు ఉద్యమకారులు కృషి చేస్తారని క్రిస్టఫర్ అన్నారు. అలాగే ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో పారదర్శకత కోసం వెంటనే ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.



# ఇన్‌పుట్ డీలర్లు రైతులకు సాంకేతికసహాయకులుగా పనిచేయాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్ సూచన



**భద్రాద్రి కొత్తగూడెం, మహా**:ఇన్‌పుట్ డీలర్లు రైతులకు సాంకేతిక సహాయకులుగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగు పంటల మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. చుంచుపల్లి రైతు వేదికలో బుధవారం దేశీ శిక్షణ కోర్సును పూర్తి చేసుకున్న 39 మంది ఇన్‌పుట్ డీలర్లకు జిల్లా కలెక్టర్ అంకిత్ డిప్లొమా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇన్‌పుట్ డీలర్లు రైతులకు వ్యవసాయ సాంకేతిక సమాచారాన్ని అందించే పారా ఎక్స్‌టెన్షన్ ప్రొఫెషనల్స్‌గా కీలకపాత్ర పోషించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికత శాస్త్రీయ సాగు పద్ధతులు ప్రత్యామ్నాయ పంటల సాగు తదితర అంశాలను రైతులకు చేరవేస్తూ వారి ఆదాయం పెంపొందించేందుకు కృషి చేయాలని అన్నారు. జిల్లాలో పంటల మార్పిడి ఆయిల్‌పామ్ కూరగాయలు మిరప తదితర ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని కలెక్టర్ అన్నారు. ఒకే రకమైన పంటలను వరుసగా సాగు చేయడం వల్ల భూసారంపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగు భూసార పరిరక్షణ సేంద్రియ కర్బనాన్ని పెంపొందించే పద్ధతులపై అవగాహన కల్పించాలని సూచించారు. నీటి లభ్యత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటలను ఎంపిక చేసుకునేలా తగిన సాంకేతిక సూచనలు అందించాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో సుమారు 37 శాతం లోటు వర్షపాతం నమోదైన నేపథ్యంలో నీటి లభ్యతకు అనుగుణంగా రైతులు పంటలను ఎంపిక చేసుకునేలా సూచనలు ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని సుమారు 2,300 చెరువుల్లో 35 శాతం కంటే తక్కువ నీటి నిల్వలు ఉన్నందున మట్టి తేమ భూసార పరీక్షలు ప్రత్యామ్నాయ పంటల సాగు నీటి వినియోగం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి మండలంలో సంబంధిత అధికారులు అందుబాటులో ఉన్నందున వ్యవసాయ శాఖ నీటిపారుదల పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు ఇన్‌పుట్ డీలర్లు సమన్వయంతో పనిచేసి రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం అందించాలని కలెక్టర్ తెలిపారు. రైతులకు సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని ఆయిల్‌పామ్ కూరగాయలు మిరప తదితర ప్రత్యామ్నాయ పంటల సాగుతో పాటు నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపికపై సూచనలు ఇవ్వాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారి బాబురావు మాట్లాడుతూ రసాయనిక ఎరువులు క్రిమిసంహారక మందుల వినియోగాన్ని క్రమంగా తగ్గిస్తూ సేంద్రియ వ్యవసాయ పద్ధతుల వైపు రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. యూరియా వినియోగాన్ని తగ్గించే దిశగా నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇన్‌పుట్ డీలర్లు తమ వ్యాపారంతో పాటు వ్యవసాయ రంగంలో వస్తున్న సాంకేతిక మార్పులను రైతులకు చేరవేసి అధిక దిగుబడులు సాధించేలా ప్రోత్సహించాలని తెలిపారు. దేశీ శిక్షణలో ప్రతిభ కనబరిచిన గుడిపాటి విజయభాస్కర్ గోల్డ్ మెడల్, అనగారి కళ్యాణ్ సిల్వర్ మెడల్ సాధించినందుకు జిల్లా కలెక్టర్ వారిని అభినందించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ చుంచుపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించిన కలెక్టర్ ప్రజలకు అందుతున్న రెవెన్యూ సేవలు దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా భూ భారతి, సాదా బైనామా కింద కార్యాలయానికి వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. భూ భారతి కింద కార్యాలయానికి వచ్చిన మొత్తం దరఖాస్తులు స్వీకరించినవి పరిశీలనలో ఉన్నవి ధ్రువీకరించినవి పరిష్కరించినవి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను రికార్డుల ఆధారంగా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో సుభాషిని, ఫెసిలిటేటర్ డేవిడ్ జైపాల్ రావు, వ్యవసాయ శాఖ ఏవోలు, వ్యవసాయ శాఖ అధికారులు, ఇన్‌పుట్ డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# శాంతిభద్రతలే లక్ష్యంగా .. పోలీస్ కమ్యూనిటీ కాంటాక్ట్

- డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు

**ఆదిలాబాద్ మహా :** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో భాగంగా పట్టణంలోని తిరుపెల్లి లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించినట్టు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు బుధవారం ఉదయం కాలనీలో తనిఖీలు చేపట్టి సరైన పత్రాలు లేని 179 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలు, 1 కార్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురి నిందితుల నుండి మద్యం బాటిళ్ల ను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే నంబర్ ప్లేట్ లేని, ఫేక్ నంబర్ ప్లేట్ కలిగిన 2 బైక్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లాలో అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, మట్కా లాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని ప్రమాదాలను నివారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎం వెంకట నర్సయ్య, ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్ర వర్ధన్, సిఐలు బి సునీల్ కుమార్, బి ప్రణయ్ కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డి వెంకటి, టి. మురళి, ఎన్ చంద్రశేఖర్, ఎస్సైలు, రిజర్వ్ సిబ్బంది, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా:** ఇందిరమ్మ ఇండ్లతో తెలంగాణ ప్రభుత్వం పేదవాడి సొతింటి కల నెరవేర్చుతుందని ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం జైనథ్ మండలంలోని కరంజి, దీపాయిగూడ గ్రామంలోని ఇందిరమ్మ ఇల్లు లబ్ది దారుల నివాసాలను సందర్శించారు. ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారులు కరంజిలో బిక్కి గంగన్న లక్ష్మి , దీపాయిగూడ లో మునిగేల అపర్ణ శ్రీనివాస్ దంపతుల కు చెందిన ఇందిరమ్మ ఇండ్లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. దంపతులకు శుభాకాంక్షలు తెలిపి నూతన వస్త్రాలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఇజ్జగిరి సంజయ్, జిల్లా మైనారిటీ సెల్ చైర్మన్ షాహిద్ అలీ, నాయకులు ఎంఏ షకీల్, దర్శనాల లక్ష్మణ్, సింగిరెడ్డి రాంరెడ్డి, ఎల్మ రాంరెడ్డి,అయాస్, అరవింద్, రతన్ రెడ్డి, మల్లారెడ్డి,జగదీష్ రెడ్డి, అశోక్, లస్మా రెడ్డి,మహిముద్ , నారాయణ రెడ్డి పాల్గొన్నారు..





# పరకాల రాజకీయాల్లో సుస్మిత సంచలనం

- డైపర్లు వేసుకునే వ్యక్తికి మళ్లీ టికెట్ ఇస్తారా.?
- ఇప్పుడైనా అప్పుడైనా పరకాలలో పోటీ చేసేది నేనే!
- నీకు కాంగ్రెస్ సంస్కృతి ఒంటపట్ట లేదు
- ముఖ్యమంత్రి పై ఘాటైన వ్యాఖ్యలు చేసిన మంత్రి కుమార్తె
- మరో మారు రాష్ట్ర కాంగ్రెస్ ను కుదిపేసిన మంత్రి కుమార్తె వ్యాఖ్యలు
- మంత్రి జన్మదిన వేడుకల్లో కూతురు కొండా సుస్మిత వ్యాఖ్యలు తీవ్ర దుమారం



**పరకాల, మహా;** మరో మారు రాష్ట్ర కాంగ్రెస్ ను మంత్రి కొండా సురేఖ కూమార్తె కొండా సుస్మిత పటేల్ వ్యాఖ్యలు కుదిపేశాయి. నేరుగా రాష్ట్ర ముఖ్యమంత్రినే టార్గెట్ చేసి ఆమె మాట్లాడిన మాటలు రాష్ట్ర రాజకీయాల్లో దుమారం రేపుతున్నాయి. ఇప్పుడు తెలంగాణ లోని పరకాల అసెంబ్లీ సెగ్మెంట్ పాలిటిక్స్ హాట్ హాట్ గా మారాయి. పరకాలలో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డివచ్చే ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం నుంచి తాజా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని మరోసారి భారీ మెజార్టీ తో గెలిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరడం ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో చర్చగా మారిన వేళ బుధవారం మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో మరోసారి ముఖ్యమంత్రిని టార్గెట్ గా మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మితా పటేల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పరకాలలో రేవూరి ప్రకాశ్ రెడ్డి పోటీ చేస్తారని రేవంత్ రెడ్డి ఎలా ప్రకటిస్తారని? పరకాలలో రేవూరి ఎవరికైనా తెలుసా అని ప్రశ్నించారు. గతంలో ఓ వేడుకలో తన తండ్రి చెప్పినట్లుగా తమ కుటుంబ సహకారంతోనే రేవూరి పరకాలలో గెలిచారని ఆమె వ్యాఖ్యానించారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని ఊకల్ క్రాస్ వద్ద ఓ ఫంక్షన్ హాల్లో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కుమార్తె సుస్మిత మాట్లాడుతూ.. ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉండగా అప్పుడే ఎలా అభ్యర్థిని ప్రకటిస్తారని నిలదీశారు. ఏది ఏమైనా పరకాలలో పోటీ చేసేది తానేనని ప్రకటించారు. ముఖ్యంగా రేవంత్ రెడ్డికి పీసీసీ చీఫ్ ఇవ్వాలని కాంగ్రెస్ లో మొదట అడిగింది కొండా దంపతులేనని గుర్తు చేశారు. పీసీసీ చీఫ్ కాగానే రేవంత్ రెడ్డి మాఇంటికి వచ్చారా లేదా అని నిలదీశారు. ముఖ్యమంత్రి కాగానే రేవంత్ రెడ్డికి కళ్ళు నెత్తికెక్కాయ అని ఘాటుగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ గెలిచినా గెలవకపోయినా కొండా మురళికి ఎమ్మెల్సీ ఇస్తామని హామీ ఇచ్చి ఇంత వరకు ఇవ్వలేదన్నారు.

రేవంత్ రెడ్డి పూటకో మాట

**కాంగ్రెస్ సంస్కృతి రేవంత్ రెడ్డికి ఇంకా ఒంట పట్టలేదని**

ఓ వైపు జెన్ జీలకు టికెట్లు ఇవ్వాలని మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి.. మరో వైపు డైపర్లు వేసుకుని తిరుగు తున్న రేవూరి ప్రకాష్ రెడ్డికి మళ్లీ టికెట్ ఇస్తానంటే ఇదేందని సుస్మిత నిలదీశారు. సంగారెడ్డి లో జగ్గారెడ్డి టికెట్ అధిష్టానం నిర్ణయిస్తుందని చెప్పిన ముఖ్యమంత్రి.. పరకాల టికెట్ మాత్రం తానే ఎలా నిర్ణయిస్తారు? రేవంత్ రెడ్డి పూటకో మాట ఎందుకు మాట్లాడు తున్నారని మండిపడ్డారు. గుర్తుపెట్టుకో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో టికెట్లు అధిష్ఠానం నిర్ణయి స్తుంది తప్ప నేతలు కాదు. సీఎం కుర్చీ కాపాడుకోవాలంటే నిబద్ధత ఉండాలి' అని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. కొడంగల్ లో రేవంత్ రెడ్డి ఓ సారి ఓడిపోలేదా? బీసీలంటే ఆయనకు ఎందుకంత చులకనా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా నీవు సలహాదారునిగా నరేందర్ రెడ్డి నియమించుకున్నావు కదా ఈ మూడేళ్లలో వేం నరేందర్ రెడ్డి రేవంత్రెడ్డికి ఏం సలహాలు ఇచ్చారు? వాటిలో ముఖ్యమంత్రిగా ఏం పాటించారో చెప్పాలని డిమాండ్ చేశారు.

**ముఖ్యమంత్రి టు పొంగులేటి**

**సీఎం మీరా లేక అతనా?**

ముఖ్యమంత్రితో పాటు సుస్మిత మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఉద్దేశించి పరోక్షంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి తో కలిసి ఓ పొంగు ఉందని, ఆ పొంగు ఎక్కువ రోజులు పొంగ లేదని, మీరు ముఖ్యమంత్రో లేక ఆయన ముఖ్యమంత్రో ప్రజలకు తెలియడం లేదని ఘాటైన వ్యాఖ్యలు చేశారు.మొన్నటికి మొన్న హైదరాబాద్ లో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తుంటే ముఖ్య మంత్రి ఫొటో తో పాటు పొంగులేటి ఫొటో వేసుకున్నారని, కానీ హైదరాబాద్ ఇన్చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఫొటో వేయలేదని, బీసీలంటే మీకు ఎందుకింత చులకనా అని ప్రశ్నించారు. ఏది ఏమైనప్పటికీ గతంలో కంటే మంత్రి కూతురు సుస్మితా పటేల్ ముఖ్యమంత్రి, మంత్రుల పై చేసిన వ్యాఖ్యల కంటే ప్రస్తుతం మంత్రి జన్మదిన వేడుకల్లో ఆమె చేసిన ఘాటైన వ్యాఖ్యలు రాష్ట్ర కాంగ్రెస్ ను ఓ కుదుపు కుదిపేశాయి. ఈ వ్యాఖ్యలు ఎంత దూరం వెళ్తాయో దీని పై కాంగ్రెస్ అధిష్టానం ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే.



# బాధలో బాసటగా..కంది శ్రీనివాస రెడ్డి పరామర్శలు

**ఆదిలాబాద్ మహా :** ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్నవారి కుటుంబాలకు ,అనారోగ్యంతో బాధపడుతున్న వారి చెంతకు వెళ్లి వారికి కొండంత ధైర్యాన్ని ఇస్తారు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి. బుధవారం జైనథ్ మండలం కరంజి గ్రామానికి చెందిన సిర్పూరె బాపూరావు అనారోగ్యంతో బాధ పడుతుండటంతో ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆయనకు ఆర్ధిక సాయాన్ని అందించారు.ఇటీవల మృతి చెందిన లక్ష్మి పూర్ గ్రామ సర్పంచ్ సోర్తే గజానాన్ మాతృ మూర్తి రుక్మ బాయి,సావాపూర్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు టింగన్ రాందాస్ సతీమణి సుశీల మృతి పట్ల సంతాపాన్ని తెలిపారు. వారి నివాసాలను సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఇజ్జగిరి సంజయ్, జిల్లా మైనారిటీ సెల్ చైర్మన్ షాహిద్ అలీ, జైనథ్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు జగదీష్ రెడ్డి,సర్పంచులు జనగ రామన్న, పొచ్చిరామ్, మహిపాల్ రెడ్డి నాయకులు ఎంఏ షకీల్, దర్శనాల లక్ష్మణ్, సింగిరెడ్డి రాంరెడ్డి, ఎల్మ రాంరెడ్డి,అయాస్ తదితరులున్నారు..

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు చారిత్రాత్మకం

**చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్, సవితకు వనపర్తి బద్రి కృతజ్ఞతలు**

**మహా ప్రతినిధి ప్రత్తిపాడు ఆగస్టు 19 :**స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పెరిక వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వనపర్తి వీరభద్రరావు (బద్రి) అన్నారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించే నిర్ణయంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.బీసీలకు రాజకీయంగా, సామాజికంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించడంలో తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ముందుంటుందని బద్రి పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లకు పునాది వేసిన ఘనత దివంగత ఎన్టీఆర్కు దక్కుతుందని, 73, 74వ రాజ్యాంగ సవరణల స్ఫూర్తితో 1995లో యాక్ట్ 5 ద్వారా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిదేనని అన్నారు.1995, 2001, 2006, 2013 సంవత్సరాల్లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జీవో 176తో పాటు జీవోలు 559, 560 ద్వారా బీసీ రిజర్వేషన్లు తగ్గించడంతో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బద్రి విమర్శించారు. 34 శాతంగా ఉన్న రిజర్వేషన్లు 24.15 శాతానికి తగ్గడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16,800 మంది బీసీ నాయకులు రాజకీయ అవకాశాలను కోల్పోయారని ఆయన పేర్కొన్నారు.స్థానిక సంస్థల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం లభిస్తేనే గ్రామస్థాయి నుంచి నాయకత్వం ఎదిగి, భవిష్యత్తులో బీసీలు రాజకీయంగా మరింత బలోపేతం అవుతారని బద్రి అన్నారు.

# చదువుకున్న నిరుద్యోగులు పట్టుదలతో ఉద్యోగం సాధించాలి

- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేకానంద



**మందమర్రి, మహా :** చదువుకున్న నిరుద్యోగులు పట్టుదలతో ఉద్యోగం సాధించాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం మందమర్రి మండల తాసిల్దార్ కార్యాలయం ముందరకాకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ఉచిత శిక్షణ కేంద్రం ద్వారా ఎస్.ఐ., కానిస్టేబుల్ నియామకానికి అవసరమైన శిక్షణను అభ్యర్థులకు అందించడం జరుగుతుందని తెలిపారు. అవకాశం ఉన్న చోట వచ్చిన ఉద్యోగాన్ని విధిగా నిర్వహించాలని, అభివృద్ధి చెందాలని తెలిపారు. నిరుద్యోగ యువత కొరకు అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్ ను ఏర్పాటు చేసి వృత్తి విద్యా కోర్సులను అందించడం జరుగుతుందని, సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. యువతకు ఖరీదైన శిక్షణ భారం కాకూడదనే ఉద్దేశంతో ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. విదేశాలలో ఉద్యోగం కొరకు జర్మన్ భాష నేర్చుకుంటున్న అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, విదేశీ ఉద్యోగాలలో రాణించాలని తెలిపారు. ఈ ప్రాంతం నుండి వందలాదిమంది యువత ఉద్యోగాలు సాధించి తమ కుటుంబాలను వెలుగులు నింపాలని తెలిపారు. అనంతరం పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి మొదటి ప్రాధాన్యత ఇస్తుందని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా విశేషంగా కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసి వృత్తి విద్యా శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్.ఐ., కానిస్టేబుల్ నియామకాల కొరకు అభ్యర్థులకు శిక్షణ అందించేందుకు ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. పోటీ ప్రపంచంలో ఏకాగ్రతతో శిక్షణ పొంది పట్టుదలతో ఉపాధి కొరకు ప్రయత్నిస్తేనే విజయం సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపి భాస్కర్, తాసిల్దార్ సతీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, పట్టణ అధ్యక్షులు మండ తిరుమలరెడ్డి సంబంధిత అధికారులతో పాటు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# మణుగూరులో ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం..

- కుటుంబ సమేతంగా ఫొటోగ్రాఫర్ల సందడి
- అసోసియేషన్ భవన నిర్మాణానికి 6 సెంట్ల స్థలం కొనుగోలు

**మణుగూరు, మహా :** ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మణుగూరులో ఫొటోగ్రాఫర్లు వేడుకలను ఘనంగా నిర్వహించారు. మణుగూరు మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుట్ట మల్లారం వద్ద కోలాహల వాతావరణంలో కుటుంబ సమేతంగా వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యురే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఫొటోగ్రఫీ జెండాను ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వన్నం కృష్ణమోహన్, కార్యదర్శి పుసులూరి శ్రీనివాస్ మాట్లాడుతూ 2008లో మణుగూరు మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అప్పటి నుంచి సభ్యుల సహకారంతో అసోసియేషన్ను బలోపేతం చేసుకుంటూ వస్తున్నామన్నారు. గుట్ట మల్లారం వద్ద అసోసియేషన్ సొంత భవన నిర్మాణం కోసం సుమారు రూ.10 లక్షలతో 6 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. సభ్యుల ఐక్యత, సహకారంతో భవన నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వేడుకల్లో భాగంగా మహిళలు, పురుషులకు వేర్వేరుగా క్రీడా పోటీలు నిర్వహించారు. ఉత్సాహంగా సాగిన ఈ కార్యక్రమంలో వన్నం కృష్ణమోహన్, పుసులూరి శ్రీనివాస్తో పాటు మణుగూరు మండలానికి చెందిన ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# భార్యను హతమార్చిన భర్త అరెస్ట్, రిమాండ్

**వరంగల్, క్రైమ్ మహా ;**గత 2023 సంవత్సరంలో భార్యను హత్య చేసిన కేసులో నిందితుడైన భర్త కుమ్మరి సుధాకర్, (క్రైమ్ నెంబర్ 129/2023, పిఎస్ ఇంత జార్గంజ్) అనే నిందితుడు 2024 నుండి కోర్టుకు హాజరు కాకుండా, కోర్టు శిక్షను తప్పించుకోవాలనే ఉద్దేశంతో తప్పించుకుని తిరుగుతూ ఉండగా, కోర్టు నిందితుడు సుధాకర్ పై ఎన్ బి డబ్ల్యూ జారీ చేయగా సదరు సుధాకర్ ను పట్టుకోవడానికి ఇంత జార్గంజ్ ఇన్స్పెక్టర్ సుకూర్ నేతృత్వంలో ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేసి అందులో సబ్ ఇన్స్పెక్టర్లు, క్రైమ్ కానిస్టేబుల్స్ సదరు సుధాకర్ ఉంటున్న ప్రదేశాన్ని టెక్నాలజీతో చాకచక్యంగా తెలుసుకొని తేదీ 19 8 2026 నిందితుడైన సుధాకర్ ను అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరుచగా కోర్టు తీర్పుతో ఆ నిందితుడిని రిమాండ్ కు తరలించడం జరిగిందని ఇన్స్పెక్టర్ ఎంఏ సుకూర్ మీడియాకు తెలిపారు.

# బెల్లంపల్లిలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

**నూతన కార్యవర్గం ఎంపిక.. సన్మానించిన రాష్ట్ర టీపీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ నాతరు స్వామి**

బెల్లంపల్లి మహా: బెల్లంపల్లి పట్టణ కేంద్రంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా తిలక్ స్టేడియం నుండి కాంటా చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగేర్ చిత్రపటానికి 187వ జన్మదినోత్సవ సందర్భంగా పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. పద్మశాలి భవన్ లో వేడుకలను బెల్లంపల్లి ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆకునూరి రాజ కుమార్ ,జిల్లా ఉపాధ్యక్షులు రుకుం ప్రసాద్ హాజరయ్యారు. . కార్యాకమానికి ముఖ్య అతిధిగా కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరీ స్వామి మాట్లాడుతూ ఫొటో గ్రాఫర్స్ అందురు ఐక్యంగా ఉంటే అన్ని విధాలుగా మీకు ఉపయోగ పడుతుందని, ఫొటో గ్రాఫర్స్ కుటుంబ భరోసా అనే పథకం ఎంతో మేలు చేస్తుందని కొనియాడారు. అనంతరం బెల్లంపల్లి లో ఫొటో & వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతనంగా ఎన్నుకోబడిన అధ్యక్షులు ఆకుల వేణు, ప్రధానకార్యదర్శిగా గజల్ రఘు, కోశాధికారిగా మడుపు విక్రమ్ లను ఎన్నుకొని శాలువాతో సన్మానించడం జరిగింది.కార్యక్రమంలో సీనియర్ నాయకులు మరియు భూటాన్ వీడియో గ్రాఫర్ సభ్యులు కాంపెల్లి విజయకుమార్,గుండ్ర మహేందర్,పట్నం చక్రధర్, కొర్రి అజయ్ కుమార్,నస్పూరి సందీప్ ల తోపాటు బెల్లంపల్లి ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులుఆకుల వేణు,ప్రధాన కార్యదర్శి గజెల్లీ రఘు,కోశాధికారి మడుపు విక్రమ్,గౌరవఅధ్యక్షులు కుంభాల రాజేష్,జిల్లాకార్యదర్శులు ఆకునూరి రాజ కుమార్,రుకుం ప్రసాద్,గౌరవ సభ్యులు కాంపెల్లి విజయ్,పట్నం చక్రదర్,దుండ్ర మహేందర్,ఫోకస్ ప్రేమ్, నస్పూరి సందీప్,దర్మేందర్, చింటూ,బాపన్న, చిన్న తదితరులు పాల్గొన్నారు.



# మరిడమ్మ అమ్మవారి ఉత్సవాలకు భక్తుల భారీ ఆదరణ

- 35 రోజుల ఉత్సవాల్లో రూ.61.35 లక్షల ఆదాయం
- 17 రోజుల్లోనే రూ.37.88 లక్షలు సమకూరిన వైనం

**మహా ప్రతినిధి పెద్దాపురం, ఆగస్టు 18:** కాకినాడ జిల్లా పెద్దాపురం ఇలవేల్పు దేవత శ్రీ మరిడమ్మ అమ్మవారి ఆషాఢ మాస ఉత్సవాలకు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. 35 రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాల్లో దేవస్థానానికి హుండీలు, అన్నదానం విరాళాల రూపంలో మొత్తం రూ.61,35,051 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారిణి, దేవాదాయ సహాయ కమిషనర్ కె. విజయలక్ష్మి తెలిపారు.ఉత్సవాల సందర్భంగా హుండీల ద్వారా రూ.60,10,453, అన్నదానం విరాళాల ద్వారా రూ.1,24,598 ఆదాయం వచ్చినట్లు ఆమె వెల్లడించారు.ఇదిలా ఉండగా, ఈ నెల 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకు 17 రోజుల ఆదాయాన్ని తాజాగా లెక్కించగా మొత్తం రూ.37,88,761 సమకూరినట్లు తెలిపారు. ఇందులో హుండీల ద్వారా రూ.37,09,515, అన్నదానం హుండీ ద్వారా రూ.79,246 వచ్చినట్లు వివరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చింతపల్లి శ్రీహర్ష, ఆలయ చైర్మన్, కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు, భక్త మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సమక్షంలో ఈ ఆదాయ లెక్కింపు ప్రక్రియ నిర్వహించారు.త ఏడాది ఉత్సవాలతో పోలిస్తే ఈసారి హుండీ ఆదాయం గణనీయంగా పెరిగింది. గత ఏడాది హుండీల ద్వారా రూ.51,32,909, అన్నదానం హుండీ ద్వారా రూ.50,071 ఆదాయం వచ్చినట్లు విజయలక్ష్మి తెలిపారు.ఆదాయ లెక్కింపు కార్యక్రమాన్ని జేవీవో వి.వి. పల్లంరాజు, దేవాదాయ తనిఖీదారు వి. ఫణీంద్రకుమార్, కాకినాడ శ్రీ నూకాలమ్మ అమ్మవారి ఆలయ అధికారి లక్ష్మణ్, పెద్దాపురం శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానం అధికారి కె. జగదీశ్వరరావు పర్యవేక్షించారు.



# నిర్మాణ రంగంలోకి సిద్ధార్థ్-కియారా

బాలీవుడ్ నటులు సిద్ధార్థ్ మల్హోత్రా, కియారా అద్వానీ త్వరలో కొత్త బాధ్యతల్లో కనిపించనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. నటీనటులుగా ఇప్పటికే గుర్తింపు తెచ్చుకున్న ఈ జంట.. ఇప్పుడు నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా సిద్ధార్థ్ కెరీర్‌కు మరింతగా ఉపయోగపడే వైవిధ్యమైన కథలను స్వయంగా నిర్మించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.
సిద్ధార్థ్ మల్హోత్రా 'షేర్షా', 'మిషన్ మజ్ను' వంటి చిత్రాలతో నటుడిగా మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. అయితే తన నటనకు మరింత ప్రాధాన్యతనిచ్చే, విభిన్నమైన కథలు ఆశించిన స్థాయిలో రావడం లేదని ఈ జంట భావిస్తున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అందుకే ఇతర నిర్మాతలు, దర్శకుల నుంచి వచ్చే అవకాశాల కోసం ఎదురుచూడకుండా.. తమకు నచ్చిన కథలను ఎంపిక చేసుకుని స్వయంగా నిర్మించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.కొత్త తరహా కథలు, విభిన్నమైన అంశాలతో సినిమాలను రూపొందించి ప్రేక్షకులను ఆకట్టుకోవాలన్నది వారి ఆలోచనగా తెలుస్తోంది. అయితే నిర్మాణ సంస్థకు సంబంధించిన అధికారిక వివరాలు, తొలి చిత్రం ఏదనే విషయంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.
ఇక కియారా అద్వానీ ప్రస్తుతం యశ్ కథానాయకుడిగా నటిస్తున్న 'టాక్సిక్' చిత్రంలో కథానాయికగా కనిపించనున్నారు. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నయనతార, హుమా ఖురేషి, కియారా అద్వానీ, రుక్మిణి వసంత్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భారీ అంచనాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.నటులుగా కొనసాగుతూనే నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టాలనుకుంటున్న సిద్ధార్థ్, కియారా నిర్ణయం బాలీవుడ్‌లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. తమ నిర్మాణ సంస్థ ద్వారా ఎలాంటి కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారో ఆసక్తిగా మారింది.

# టాక్సిక్‌పై పెరుగుతున్న ఆసక్తికర అంచనాలు

రాకింగ్ స్టార్ యశ్ నటిస్తున్న 'టాక్సిక్' సినిమాపై రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం యశ్ గత సినిమాలకు భిన్నమైన కథ, ట్రీట్‌మెంట్‌తో తెరకెక్కుతున్నట్లు చిత్ర వర్గాలు చెబుతున్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించి యూకే సెన్సార్ వివరాలంటూ కొన్ని నివేదికలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. సినిమాలో హింస, పెద్దలకు సంబంధించిన అంశాలు ఎక్కువగా ఉన్నాయనే కారణంతో అక్కడ కఠినమైన వర్గీకరణ లభించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వివరాలపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.'టాక్సిక్' కథ డ్రగ్ మాఫియా నేపథ్యంలో సాగుతుందని ఇప్పటికే ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో యశ్ పాత్రను గత చిత్రాలతో పోలిస్తే మరింత డార్క్ షేడ్స్‌తో చూపించినట్లు తెలుస్తోంది. టీజర్‌లో కనిపించిన యాక్షన్ సన్నివేశాలు కూడా సినిమాపై అంచనాలను పెంచాయి.సినిమా రన్‌టైమ్, సెన్సార్ సర్టిఫికేషన్‌కు సంబంధించిన వివరాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. సాధారణ కమర్షియల్ సినిమాల తరహాలో కాకుండా, డార్క్ టోన్‌తో కథను చెప్పే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. యశ్, గీతూ మోహన్ దాస్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందనే అంచనాలు ఉన్నాయి. సెన్సార్‌కు సంబంధించిన ప్రచారంలో ఎంతవరకు వాస్తవం ఉందో, సినిమా విడుదలకు ముందు మేకర్స్ ఇచ్చే అధికారిక సమాచారంతోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



# సంప్రదాయ లుక్‌లో ఐశ్వర్యా సందడి

**ఓనం వేడుకలకు ముందే మెరిసిన ఐశ్వర్యా మీనన్**

"ఓనం వేడుకలకు ఇది నా వార్మప్" అంటూ నటి ఐశ్వర్యా మీనన్ పంచుకున్న తాజా లుక్ సోషల్ మీడియాలో ఆకట్టుకుంటోంది. సంప్రదాయ క్రీమ్ రంగు చీరలో ఐశ్వర్యా ఎంతో అందంగా, హుందాగా కనిపించారు. చీరకు ఉన్న ఆకర్షణీయమైన పింక్, గోల్డ్ బార్డర్ ఆమె అందాన్ని మరింత ఇనుమడింపజేసింది. దీనికి సరిపోయే పింక్ బ్లౌజ్ ధరించి, సంప్రదాయ బంగారు ఆభరణాలతో ఆమె అలంకరించుకున్నారు. మృదువైన చిరునవ్వు, వేవీ హెయిర్ స్టైల్, గ్రేస్‌ఫుల్ పోజ్‌తో ఐశ్వర్యా పండుగ వాతావరణాన్ని మరింత అందంగా మార్చారు. ముఖ్యంగా కేరళ సంప్రదాయానికి దగ్గరగా కనిపించే ఈ లుక్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది.1995 మే 8న తమిళనాడులోని ఈరోడ్‌లో జన్మించిన ఐశ్వర్యా మీనన్ కుటుంబానికి కేరళతోనూ అనుబంధం ఉంది. ఆమె ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్‌లో ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్ చదువుకున్నారు. ఆ తర్వాత నటనపై ఆసక్తితో వినోద రంగంలోకి అడుగుపెట్టారు. మొదట తమిళ టెలివిజన్ సీరియల్ 'తెండ్రల్' ద్వారా ప్రేక్షకులకు పరిచయమయ్యారు. అనంతరం 2012లో 'కాదలిల్ సొదప్పువదు యెప్పడి' చిత్రంతో వెండితెరపై అడుగుపెట్టారు. 2013లో వచ్చిన 'తీయా వేలై సెయ్యనుమ్ కుమారు' చిత్రంతోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.ఐశ్వర్యా తమిళంతో పాటు కన్నడ, మలయాళం, తెలుగు భాషల్లోనూ నటిస్తూ తన పరిధిని విస్తరించుకున్నారు. 2013లో 'దసవాల' సినిమాతో కన్నడలోకి ప్రవేశించిన ఆమె.. 2016లో 'మాన్‌సూన్ మ్యాంగోస్'తో మలయాళ ప్రేక్షకులకు పరిచయమయ్యారు. 2023లో 'స్పై' సినిమాతో తెలుగు సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు. 'తమిళ్ పడం 2', 'నాన్ సిరితాల్', 'వేళం', 'భజే వాయు వేగం' వంటి చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు.ఇటీవల 2025లో విడుదలైన 'బజూకా' చిత్రంలోనూ ఐశ్వర్యా మీనన్ కనిపించారు. ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' చిత్రంలో నటిస్తున్నారు. తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం భాషల్లో వరుస అవకాశాలతో ముందుకు సాగుతున్న ఐశ్వర్యా.. విభిన్నమైన పాత్రలు, ఆకట్టుకునే గ్లామర్‌తో ప్రేక్షకులను అలరిస్తున్నారు. తాజా ఓనం లుక్‌తో మరోసారి తన ఫ్యాషన్ సెన్స్‌తో అభిమానుల దృష్టిని ఆకర్షించారు.



# ఆధునిక డేటింగ్‌పై కంగనా వ్యాఖ్యలు

బాలీవుడ్ నటి కంగనా రనౌత్ మరోసారి తన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. ఆధునిక డేటింగ్ సంస్కృతిలో పెరుగుతున్న కొన్ని ధోరణులపై ఆమె తీవ్రంగా స్పందించినట్లు సమాచారం. ముఖ్యంగా సంబంధాలను సూచించేందుకు ఉపయోగిస్తున్న కొత్త పదజాలం, వాటి వెనుక ఉన్న పాశ్చాత్య ఆలోచనా విధానం మానవ సంబంధాల విలువలను దెబ్బతీస్తున్నాయని ఆమె అభిప్రాయపడినట్లు తెలుస్తోంది.ప్రస్తుతం డేటింగ్ వేదికల ప్రభావంతో పరిచయాలు త్వరగా ఏర్పడటం, అదే విధంగా సంబంధాలు త్వరగా ముగియడం సాధారణంగా మారిందని కంగనా అభిప్రాయపడినట్లు సమాచారం. భాగస్వామిని కేవలం ఒక సంఖ్యగా చూడటం లేదా ఎలాంటి వివరణ ఇవ్వకుండా సంబంధం నుంచి అకస్మాత్తుగా తప్పుకోవడం వంటి ధోరణులను ఆమె తప్పుబట్టారు.ఎదుటి వ్యక్తికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అకస్మాత్తుగా సంబంధాన్ని ముగించడం అవతలి వ్యక్తి మానసిక స్థితిపై ప్రభావం చూపుతుందని కంగనా పేర్కొన్నట్లు తెలుస్తోంది. అలాగే గత సంబంధాల సంఖ్యను సూచించే పదజాలం వ్యక్తులను వస్తువులుగా చూసే మనస్తత్వానికి దారితీయవచ్చని ఆమె అభిప్రాయపడినట్లు సమాచారం.భావోద్వేగాలు, పరస్పర గౌరవం కంటే తాత్కాలిక ఆకర్షణలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల దీర్ఘకాలిక సంబంధాలు దెబ్బతింటున్నాయని కంగనా పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఆధునికత పేరుతో ఇతర దేశాల నుంచి వస్తున్న ప్రతి పోకడను అనుసరించాల్సిన అవసరం లేదని, భారతీయ కుటుంబ విలువలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె సూచించినట్లు సమాచారం.వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో భిన్న స్పందనలు కనిపిస్తున్నాయి. కొందరు ఆమె అభిప్రాయాలను సమర్థిస్తుండగా.. మరికొందరు సంబంధాల విషయంలో వ్యక్తిగత స్వేచ్ఛకు ప్రాధాన్యత ఇవ్వాలని అంటున్నారు. ఏదేమైనా ఆధునిక సాంకేతికత, సామాజిక మాధ్యమాల ప్రభావం పెరుగుతున్న సమయంలో ప్రేమ, విశ్వాసం, గౌరవం వంటి విలువలను కాపాడుకోవాల్సిన అవసరంపై ఆమె వ్యాఖ్యలు మరోసారి చర్చకు తెరతీశాయి.



# తొమ్మిదేళ్ల బకాయిలు చెల్లించిన వర్మ

సంచలన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ మరోసారి వార్తల్లో నిలిచారు. ఈసారి తన సినిమా కారణంగా కాకుండా.. తొమ్మిదేళ్ల క్రితం నాటి బకాయిల వ్యవహారంతో చర్చలోకి వచ్చారు. పాత బకాయిలు చెల్లించకపోవడంతో వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'పోలీస్ కంపెనీ' చిత్రీకరణను సినీ కార్మికుల సమాఖ్య నిలిపివేసినట్లు సమాచారం. దీంతో ఈ వ్యవహారం చిత్ర పరిశ్రమలో చర్చనీయాంశంగా మారింది.

**తొమ్మిదేళ్ల నాటి బకాయిలపై వివాదం**
**చిత్రీకరణను నిలిపివేసిన సినీ కార్మికుల సమాఖ్య**
**రూ.1.11 కోట్ల బకాయిల చెల్లింపునకు అంగీకారం**
**సమస్య పరిష్కారంతో తిరిగి ప్రారంభమైన చిత్రీకరణ**

వర్మ గతంలో తెరకెక్కించిన కొన్ని చిత్రాలకు పనిచేసిన సాంకేతిక నిపుణులకు అందాల్సిన పారితోషికాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని సినీ కార్మికుల సమాఖ్య ఆరోపించింది. బకాయిలు చెల్లించే వరకు ప్రస్తుత సినిమా చిత్రీకరణను కొనసాగించనివ్వబోమని స్పష్టం చేయడంతో చిత్రీకరణకు కొంతకాలం అంతరాయం ఏర్పడింది. ఈ విషయం వర్మ దృష్టికి రావడంతో ఆయన స్పందించినట్లు తెలుస్తోంది. సంబంధిత సాంకేతిక నిపుణులకు చెల్లించాల్సిన సుమారు రూ.1.11 కోట్ల బకాయిలను పరిష్కరించేందుకు అంగీకరించినట్లు సమాచారం. దీంతో వర్మకు, సమాఖ్యకు మధ్య నెలకొన్న ఆర్థిక వివాదం సద్దుమణిగినట్లు తెలుస్తోంది.కార్మికులు, సాంకేతిక నిపుణులకు పారితోషికాలు సకాలంలో అందించడం ఎంత ముఖ్యమో ఈ ఘటన మరోసారి గుర్తుచేసింది. పాత బకాయిల కారణంగా చిత్రీకరణకు ఏర్పడిన అడ్డంకులు తొలగిపోవడంతో 'పోలీస్ కంపెనీ' చిత్రీకరణ తిరిగి ప్రారంభమైనట్లు సమాచారం.వివాదాలకు తరచూ వార్తల్లో నిలిచే రామ్‌గోపాల్ వర్మ.. ఈసారి మాత్రం సమస్యను పరిష్కరించేందుకు ముందుకు రావడంతో వ్యవహారం ముగిసింది. చిత్రీకరణ తిరిగి ప్రారంభం కావడంతో అనుకున్న సమయానికి సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడంపై చిత్రబృందం దృష్టి పెట్టింది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com